



RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక






ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 330 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | మంగళవారం 08 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-

# తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపుకు కుట్ర

- సీఎం రేవంత్

- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి
- 2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ
- లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న వారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు.

**కొడంగల్‌లో 81 వేల ఓట్లు..**

తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని .......

2

## ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు..

ప్లకార్డులు తెస్తే సహించేది లేదని స్పీకర్ వార్నింగ్

- వాడీవేడీ వాతావరణం మధ్య ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు
- వందేమాతరం పూర్తి చరణాలను ఆలపించిన సభ్యులు
22-ఏపై బీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్న స్పీకర్



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు వాడీవేడి వాతావరణం నడుమ ప్రారంభమయ్యాయి. సభ ఆరంభంలో జాతీయ గేయం 'వందేమాతరం' పూర్తి 6 చరణాలను సభ్యులందరూ భక్తిశ్రద్ధలతో ఆలపించారు. అనంతరం స్పీకర్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ సభా ప్రాంగణంలోకి ఎవరూ ప్లకార్డులు, నిరసన పత్రాలు తీసుకు రావడానికి వీల్లేదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పక్ష సభ్యులు ఎవరైనా ప్లకార్డులు తెస్తే, వాటిని వెంటనే మార్షల్స్‌కు అప్పగించాలని సూచించారు. సభ సమగ్రతను, మర్యాదను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

2

## ఇది దుశ్శాసన సభ

మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా? - కేటీఆర్

- శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్
- తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి
- ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు....

2

## ఇది నాకో, సునీతమ్మకో జరిగిన అవమానం కాదు : సబితా ఇంద్రారెడ్డి

- మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లారన్న సబిత
- కేటీఆర్ అడ్డుకోకపోయి ఉంటే అక్కడే పడేసి తొక్కేసే వారని ఆవేదన
- హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపాటు



2

## నేడు తెలంగాణలో డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రైవేట్ కాలేజీల ఆందోళన
- మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చిన డిగ్రీ, పీజీ కాలేజీల సంఘం
- వేల కోట్ల బకాయిలతో జీతాలు చెల్లించలేకపోతున్నామని యాజమాన్యాల ఆవేదన



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం (టీపీడీఎంఏ) ఒక ప్రకటన విడుదల చేసింది. బంద్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల కార్యకలాపాలను నిలిపివేయనున్నట్లు యాజమాన్యాలు తెలిపాయి. పట్టణ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తామని, ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణమే..

2

గ్యాస్ వినియోగదారులకు గుడ్‌న్యూస్..

## బుకింగ్‌పై కేంద్రం కీలక నిర్ణయం



- గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్
- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఇక ఒకే నిబంధన
- వెంటనే అమల్లోకి రానున్న కొత్త విధానం
- 45 రోజుల గ్రామీణ నిబంధనకు కేంద్రం ముగింపు
- ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌కు ఆదేశాలు

2

## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు




అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ

2

సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని అంగీకరించిన ఎన్నికల సంఘం

నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

## నేను స్పీకర్‌ను, చైర్మన్‌ను దూషించలేదు..

నా మాటలను కాంగ్రెస్ వక్రీకరిస్తోంది - ఎమ్మెల్సీ తాతా మధు



- అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు
- స్పీకర్ స్థానంపై తనకు అపారమైన గౌరవం ఉందని వ్యాఖ్య
- తన గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానన్న మధు

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** అసెంబ్లీ స్పీకర్ ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ కాంగ్రెస్ దళిత ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. మధు చేసిన వ్యాఖ్యలు సరికాదంటూ అధికార పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో తాతా మధు మాట్లాడుతూ... శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలను ఉద్దేశించి తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, స్పీకర్ స్థానమంటే తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో తనపై కాంగ్రెస్ పార్టీ కావాలనే దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల,.....

2

## ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు.. పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు

- అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని పోలీసులకు ఆదేశం
- నిబంధనల ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారని స్పష్టీకరణ
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై విచారణ జరపాలని ఉత్తర్వులు
- బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని డీజీపీకి సూచన

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ శాసన సభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



2
నేటి శుభోదయ
మంగళవారం | హైదరాబాద్
08 - 09 - 2026
www.netisubhodaya.com



# తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపుకు కుట్ర - సీఎం రేవంత్

**మొదటిపేజీ తరువాయి..** ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

**సారంపల్లి సేవలు చిరస్మరణీయం**

రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

---

## ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు..

**- ప్లకార్డులు తెస్తే సహించేది లేదని స్పీకర్ వార్నింగ్**

**మొదటిపేజీ తరువాయి..** రాష్ట్రంలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్న సెక్షన్ 22–ఏ నిషిద్ధ భూముల వ్యవహారంపై సభలో చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో స్పీకర్ కీలక ప్రకటన చేశారు. శాసనసభా వ్యవహారాల సలహా కమిటీ (BAC) సమావేశంలో చర్చించిన తర్వాతే 22–ఏ అంశంపై సభలో ఏ విధంగా చర్చ చేపట్టాలనే దానిపై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. నియమావళికి లోబడి ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనే సంకేతాలు ఇస్తూనే... సభాకార్యక్రమాలకు అంతరాయం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పీకర్ స్పష్టం చేశారు.

---

# ఇది దుశ్శాసన సభ

**మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా? - కేటీఆర్**

**మొదటిపేజీ తరువాయి..** గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పని చేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

# నేడు తెలంగాణలో డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

**మొదటిపేజీ తరువాయి..** స్పందించకపోతే భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించాయి. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కళాశాలల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశాయి. సిబ్బంది వేతనాలు, భవనాల అద్దెలు, విద్యుత్ బిల్లులు వంటి నిర్వహణ ఖర్చులు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ఉన్నామని వాపోయాయి. ఫీజు బకాయిలు సుమారు రూ. 10,000 కోట్ల వరకు పేరుకుపోయాయని ఇటీవలి కథనాలు, రాజకీయ నేతల ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిని తట్టుకోలేక రాష్ట్రంలో దాదాపు 310 ప్రైవేట్ కళాశాలలు మూతపడ్డాయని ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు. ఈ సమస్యపై గతంలో ప్రైవేట్ విద్యాసంస్థలు పలుదఫాలుగా ఆందోళనలు చేపట్టినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టమైన హామీ లభించలేదని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. తాజా బంద్‌తో తమ నిరసనను మరింత ఉద్ధృతం చేస్తున్నట్లు వెల్లడించాయి.

## నేను స్పీకర్‌ను, చైర్మన్‌ను దూషించలేదు..

**నా మాటలను కాంగ్రెస్ వక్రీకరిస్తోంది - ఎమ్మెల్సీ తాతా మధు**



**మొదటిపేజీ తరువాయి..** ప్రజాప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, తన ప్యాంటు లాగి గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానని, తీవ్ర అసహనంతో అన్న మాటలను స్పీకర్‌కు ఆపాదిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం, చేతకానితనంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి తప్పుడు ఆరోపణలకు తెరతీసిందని తాతా మధు విమర్శించారు. "పోలీసుల అక్రమాలను ప్రశ్నిస్తే.. దాన్ని స్పీకర్‌ను అవమానించినట్లు చిత్రీకరిస్తూ కాంగ్రెస్ నేతలు శవరాజకీయాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల డిమాండ్లకు భయపడేది లేదు" అని తేల్చిచెప్పారు. అధికార ప్రతిపక్షాల మధ్య సాగుతున్న ఈ ఆరోపణలు, సవాల్‌లతో అసెంబ్లీ ప్రాంగణంలో పొలిటికల్ హీట్ మరింత రగిలింది.

# ఇది నాకో, సునీతమ్మకో జరిగిన అవమానం కాదు

**- సబితా ఇంద్రారెడ్డి**

**మొదటిపేజీ తరువాయి..** అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై అభ్యంతరకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది కేవలం తమకు జరిగిన పరాభవం కాదని, మొత్తం తెలంగాణ మహిళా సమాజానికి జరిగిన తీవ్ర అవమానమని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ 1,000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి తరలివచ్చిన తమను పోలీసులు అమానుషంగా అడ్డుకున్నారని, మహిళా ఎమ్మెల్యేలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళుతూ, చీరలు లాగుతూ విచక్షణారహితంగా ప్రవర్తించారని ఆరోపించారు. "సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని పోలీసులు లాగుతుంటే, కేటీఆర్ సమయానికి వచ్చి అడ్డుకోకపోయి ఉంటే మమ్మల్ని అక్కడే పడేసి తొక్కేసేవారు.. కేటీఆర్ రావడంతోనే మేము ప్రాణాలతో బయటపడ్డాం" అని సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే గొంతు నొక్కడం, బట్టలు లాగడం, దాడికి దిగడం ఏ రకమైన ప్రజాపాలన అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం... నేడు ప్రజాప్రతినిధులైన మహిళలకే రక్షణ లేకుండా చేస్తోందని దుయ్యబట్టారు. హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తూ, అక్రమ అరెస్టులతో గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు




**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

# గ్యాస్ వినియోగదారులకు గుడ్‌న్యూస్.. బుకింగ్‌పై కేంద్రం కీలక నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి..** వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

# అసెంబ్లీలో ఊహించని పరిణామం..

**కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్ కుమార్**



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీలో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు రాగా, దీనిపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం అసెంబ్లీ వెలుపల తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం చట్టసభల గౌరవాన్ని దెబ్బతీయడమేనని సీఎం అన్నారు. తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభాపతికి జరిగిన అవమానం సభ్య సమాజానికి జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి భాషను చట్టసభల్లో సహించకూడదని స్పష్టం చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. స్పీకర్‌పై అనుచిత భాష ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రసాద్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఛైర్‌లో ఉండగానే కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సభలో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. మంత్రి సీతక్క కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధాకరం అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు అత్యున్నత పదవుల్లో ఉండటాన్ని కొందరు ఓర్వలేకపోతున్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు.

## అసెంబ్లీలో రచ్చ.. బీజేపీకి అన్నింట్లో రాజకీయాలే కావాలంటూ కోమటిరెడ్డి ధ్వజం



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన వెంటనే సభలో బీజేపీ సభ్యుల గందరగోళంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించగానే, బీజేపీ ఎమ్మెల్యేలు 22–ఏ నిషిద్ధ భూముల అంశంపై తక్షణమే చర్చ చేపట్టాలని పట్టుబడుతూ ప్లకార్డులతో సభాప్రాంగణంలోకి దూసుకెళ్లారు. స్పీకర్ కల్పించుకుని... బీఏసీ సమావేశంలో చర్చించి 22–ఏపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అయినప్పటికీ బీజేపీ సభ్యులు తగ్గలేదు. భూ దందాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలంటూ బీజేపీ సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. మరోవైపు, బీజేపీ సభ్యుల తీరుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "సభలో ఏ అంశంపైనైనా సుదీర్ఘంగా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే, బీజేపీ నాయకులకు మాత్రం అన్నింట్లో రాజకీయాలే కావాలి" అని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ. లక్ష కోట్ల మేర భారీ అవినీతి జరిగిందని, దానిపై సీబీఐ విచారణ జరిపించాలని ఏడాది క్రితం లేఖ రాసినా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. బీఆర్ఎస్‌తో లోపాయికారీగా కుమ్మక్కై విచారణ జరగకుండా బీజేపీ అడ్డుపడుతోందని సంచలన ఆరోపణలు చేశారు. కాళేశ్వరం అవినీతి బయటకు రాకుండా స్వయంగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలే అడ్డుపడుతున్నారని కోమటిరెడ్డి మండిపడ్డారు. aమరో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... సభకు బీజేపీ సభ్యులు సహకరించాలని విన్నవించారు. ప్రొసీజర్ ప్రకారం సభ నడవాలని అన్నారు. 22–ఏపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

మంగళవారం | హైదరాబాద్
08 - 09 - 2026
www.netisubhodaya.com
నేటి శుభోదయ
3

## ధర్పల్లిలో సర్పంచ్ ఏకపక్ష వైఖరిపై 6వ వార్డు మెంబర్ తీవ్ర నిరసన



**నిజామాబాద్ రూరల్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** గ్రామ పంచాయతీ పాలనలో ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ, సర్పంచ్ చెలిమేల శ్రీనివాస్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ 6వ వార్డు మెంబర్ ప్రశాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ నిబంధనల ప్రకారం వార్డులో చేపట్టే ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలకైనా స్థానిక వార్డు సభ్యుడికి ముందస్తు సమాచారం అందించాల్సి ఉండగా, సర్పంచ్ నిరంకుశంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు.ఇటీవల 6వ వార్డు పరిధిలో మహిళా మండలి భవన నిర్మాణ స్థలంలో ముగ్గు పోసేందుకు, వార్డు మెంబర్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ట్రాక్టర్లతో స్థలాన్ని శుభ్రం చేయించడం పట్ల నిరసన వ్యక్తమైంది. ప్రజలచే ఎన్నుకోబడిన వార్డు ప్రతినిధిని విస్మరించి పనులు చేపట్టడం పంచాయతీరాజ్ చట్ట నిబంధనలను ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు.ప్రజాప్రతినిధులను చిన్నచూపు చూస్తూ, పారదర్శకత లేకుండా వ్యవహరిస్తున్న సర్పంచ్ తన తీరును తక్షణమే మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఇకనైనా వార్డులో జరిగే పనుల వివరాలను స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేస్తూ కలుపుకొనిపోవాలని, లేనిపక్షంలో వార్డు ప్రజలతో కలిసి పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## డోర్నకల్–గద్వాల రైల్వే లైన్‌కు రైల్వే బోర్డు ఆమోదం చారిత్రాత్మకం

**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన డోర్నకల్ – గద్వాల నూతన రైల్వే ప్రాజెక్టుకు రూ. 8,993.77 కోట్ల అంచనా వ్యయంతో రైల్వే బోర్డు ఆమోదం తెలపడం హర్షణీయమని తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ డి. వై. గిరి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే బోర్డు విధించిన షరతు మేరకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రాజెక్టులో తమ వాటా నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఆమోదం పొందిన మల్కన్‌గిరి ప్రాజెక్టుకు తోడు ఈ గద్వాల లైన్ అనుసంధానమైతే, డోర్నకల్ జంక్షన్ కేంద్రంగా తూర్పు భారత్ (ఒడిశా/ఛత్తీస్‌గఢ్) నుండి దక్షిణ భారత్ (కర్ణాటక/రాయలసీమ)కు 300 కి.మీలకు పైగా దూరం తగ్గుతుందని ఆయన స్పష్టం చేశారు. అలాగే రైల్వే బోర్డు వద్ద ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న డోర్నకల్–మిర్యాలగూడ డీపీఆర్‌తో పాటు డోర్నకల్–ఇల్లందు–రామగుండం సింగరేణి కారిడార్‌ను కూడా వెంటనే మంజూరు చేసి డోర్నకల్‌ను దేశంలోనే అతిపెద్ద లాజిస్టిక్స్ హబ్‌గా డోర్నకల్ ను తీర్చిదిద్దాలని కేంద్రాన్ని ప్రభుత్వాన్ని కేంద్ర స్కిల్ డేవలప్ శాఖ మంత్రి చౌదరి జయంత్ సింగ్ ద్వారా కోరారు. డోర్నకల్ నియోజకవర్గం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎప్పటికప్పుడు స్పందించి ఆయా రైల్వే ప్రాజెక్టుల మంజూరు కోసం కృషి చేస్తున్న కేంద్ర మంత్రి జయంత్ సింగ్ కి డి. వై. గిరి కృతజ్ఞతలు తెలిపారు.

## పెసర పంట కొనుగోలు నిర్లక్ష్యం చేయకండి

- ఎరువుల , ఆన్ లైన్ యాప్ బుకింగ్ ఇబ్బందులు తొలగించాలి
- కలెక్టర్ కు రైతు సంఘం వినతి



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ఖరీఫ్ పెసర పంట ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు నిర్లక్ష్యం విడి మార్కెఫేడ్ ద్వారా తక్షణమే పెసర పంటను కొనుగోలు చేయాలని, ఎరువులు ఆన్ లైన్ యాప్ బుకింగ్ లో రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా సమితి తరపున రైతు బృందం సోమవారం ఖమ్మం కలెక్టర్ కు రైతు సమస్యలు తో కూడుకున్న వినత పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ మాట్లాడుతూ ఎరువులు ఆన్ లైన్ యాప్ బుకింగ్ విధానం వల్ల గ్రామీణ ప్రాంతాల రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు ఎరువులు కోసం రైతులు తమ వ్యవసాయ పనులను సైతం వదులుకొని ఎరువుల దుకాణాలు చుట్టూ రోజులు తరబడి తిరగాల్సిన పరిస్థితి ఏర్పడదని వారు ఆరోపించారు. గ్రామీణ ప్రాంతంలో సాంకేతిక పరిజ్ఞానం ఇంటర్నెట్ సదుపాయం ఆన్ లైన్ విధానం పై రైతులుకు అవగాహన లేక ప్రభుత్వ యంత్రాంగం నుండి సరైన సహాయ సహకారాలు అందకపోవడంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితులు రైతుల్లో నెలకొంది ఉంది అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వ్యవసాయ శాఖ ద్వారా గ్రామ గ్రామాన వ్యవసాయానికి కావలసిన ఎరువులు అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకొని రైతులకు ఎరువులు ఇబ్బంది లేకుండ చూడాలని వారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వర్షాధార ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పంటల ప్రణాళిక కార్యచరణ రూపొందించి అమలు కావాల్సిన అన్ని ఆర్థిక వ్యవసాయ ఇబ్బందులను ఎదుర్కొనేందుకు అన్ని రకాల చర్యలు ప్రభుత్వాలు తీసుకొని రైతులకు సమాచారాన్ని ఇవ్వాలని వారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా పాలేరు చెరువు భక్త రామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా కూసుమంచి తిరుమలాయపాలెం మండలాల చెరువులకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం నుండి కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు భానోత్ రామకోటి, భాగం ప్రసాద్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు స్వర్ణ రమేష్, తోటపల్లి సీతా రాములు, ఎర్ర శ్రీనివాసరావు, చింతల ఆదినారాయణ లు, తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హన్మకొండ, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి, సహజ రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ప్రజల కు సూచించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో తెలంగా ణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ), హనుమకొండ జిల్లా ఆధ్వ ర్యంలో నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ), రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను చెరువు లు, కుంటల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరు లు కలుషితమయ్యే ప్రమా దం ఉందన్నారు. తద్వారా పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రజలు పర్యా వరణహితమైన మట్టి విగ్రహాలను వినియోగించి నీటి వనరులు, ప్రకృతిని కాపాడేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. వినాయక చవితి సందర్భంగా భక్తి భావంతో పాటు పర్యావరణ పరిరక్ష ణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పిలు పునిచ్చారు. సహజంగా మట్టిలో కలిసిపోయే విగ్రహాలను వినియోగించ డం ద్వారా పండుగను పర్యావరణహితంగా నిర్వ హించవచ్చని పేర్కొన్నారు.కార్యక్రమంలో హన్మకొండ టీజీపీసీబీ నోడల్ అధికారి బి. జీమూత వాహన, వివిధ శాఖల జిల్లా అధి కారులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

## ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏర్పాటు..

### - ఉద్యమ బలోపేతానికి నాయకుల పిలుపు



**నిజామాబాద్ రూరల్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలోని మాదిగ సంఘం హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల మండల స్థాయి నూతన కమిటీ నిర్మాణ సదస్సు ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ధర్పల్లి మండల ఇంచార్జీ నక్క రాజేందర్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా ఇంచార్జీ మాసాయిపేట యాదగిరి మాదిగ, విశిష్ట అతిథిగా ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఇంచార్జీ గంధమల నాగభూషణం మాదిగ, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాసాయిపేట యాదగిరి మాదిగ మాట్లాడుతూ, మాదిగల హక్కుల సాధన, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఎమ్మార్పీఎస్ నిరంతరం ఉద్యమిస్తోందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ ఫలాలు నిజమైన అర్హులకు పూర్తిస్థాయిలో అందేలా ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు ఎమ్మార్పీఎస్‌ను మరింత పటిష్టం చేయడమే ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి ఉద్యమ లక్ష్యాల సాధన కోసం ఐక్యంగా, క్రమశిక్షణతో పనిచేయాలని పిలుపునిచ్చారు.అనంతరం మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మార్పీఎస్ సిరికొండ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మండలంలోని ప్రతి గ్రామంలో సంఘాన్ని విస్తరించి, మాదిగల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ డిచ్పల్లి మండల ఇన్చార్జ్ నర్సయ్య మాదిగ ఇందలవాయి మండలం ఇంచార్జ్ కిష్టయ్య మాదిగ సిరికొండ మండల ఇన్చార్జ్ దీపక్, మాదిగ,రూరల్ మండలం ఇంచార్జ్ యాదసి రాములు మాదిగ, ఎమ్ ఆర్ పి ఎస్ , ఎంఎస్పీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కొత్త గ ఏర్పడిన కమిటీ అధ్యక్షుడు, పూసిన భాస్కర్ఉపాధ్యక్షుడు, నూత్పల్లి కిరణ్ప్రధాన కార్యదర్శి, తెడ్డు సాయికుమార్కార్యదర్శి,తెడ్డు రవిసహాయ కార్యదర్శి పూసిన సందీప్కోశాధికారి ఒడ్డెటి సుమన్అధికార ప్రతినిధి,రాంచందర్ సభ్యులు:సిరికొండ గణేష్ మేతరి నర్సయ్య తేడ్డు శ్రీనివాస్ నూత్పల్లి భూమయ్య గుండా విజయ్ నల్లూరి గంగనర్సయ్య

## "ఎల్ఐసి సౌతా సెంట్రల్ జోనల్ సిడబ్లూఏ ఎడ్యుకేషన్ కమటి చైర్మెన్" గా లోడిగ వెంకన్నయాదవ్ నియామకం



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07:** జీవిత భీమా సంస్థలో 35 సంవత్సరాలనుండి సేవలందిస్తున్న లోడిగ వెంకన్నయాదవ్ ని ఎల్ఐసి క్లియా వెల్ ఫైర్ అసోషన్ (సిడబ్లూఏ) సౌత్ సెంట్రల్ జోన్ ఎడ్యుకేషన్ కమిటీ చైర్మెన్ గా జోన్ అద్యక్షులు ధనుంజయ ఆచార్య నియమించారు.వెంకన్న ఈ పదవి లో నాలుగు సంవత్సరాలు పాటు కొనసాగుతారు. గడిచిన నాలుగు సంవత్సరాల పాటు సౌత్ సెంట్రల్ జోన్ కి సిడబ్లూఏ వైస్ ప్రెసిడెంట్ గా సేవలందించారు. దీనికి గాను రానున్న నాలుగు సంవత్సరాలపాటు సౌత్ సెంట్రల్ జోన్ కి ఎడ్యుకేషన్ కమిటీ చైర్మెన్ గా వెంకన్న సేవలు అందించనున్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గట్టుసింగారంలో జన్మించిన వెంకన్న 1990 లో జీవిత భీమా ఏజెంట్ గా ఇన్సూరెన్స్ రంగంలోకి రంగ ప్రవేశం చేశారు. అనతి కాలంలోనే ఖమ్మం బ్రాంచ్ ఏజెంట్ అసోసియేషన్ కి అద్యక్షులుగా 1994 ఎన్నికల్లో గెలుపొందారు. ఆ వెనువెంటనే వచ్చిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా గట్టుసింగారం పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు.గ్రామ అభివృద్ధి లో విశేషమైన కృషి చేసి ఉత్తమ సర్పంచుతో పాటు స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం బంగారు పథకం ప్రశంస పత్రంతో సత్కారించింది. సర్పంచ్ పదవి పూర్తి అయిన వెంటనే తిరిగి మరల ఎల్ఐసి లో క్రియాశీలంగా పనిచేసి 125 దేశాలు పాల్గొనే మిలినియం రౌండ్ టేబుల్ సమావేశం గ్లోబల్ కాన్ఫరెన్స్ ఆస్ట్రేలియా లో జరిగింది. ఈసభకు భారతదేశం నుంచి పాల్గొనే అవకాశం వెంకన్నకు ఎల్ఐసి ద్వారా లభించింది. తద్వారా సంస్థ నుండి అనేక దేశాలు వెళ్ళే అవకాశం వెంకన్నకు లభించింది. 2019 లో ఏజెంట్ నుండి ఛీఫ్ లైఫ్ ఇన్సురెన్సు అడ్వైజర్ గా ఖమ్మం బ్రాంచిలో సేవలందిస్తున్నారు.

## తనికెళ్లలో ఆలయాల శంకుస్థాపన మహోత్సవానికి హాజరైన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07:** ఖమ్మం జిల్లా, కొణిజర్ల మండలంలోని తనికెళ్ళలో గల ప్రఖ్యాత చంద్రమౌళీశ్వర స్వామి, ఆంజనేయస్వామి దేవాలయాల శంకుస్థాపన మహోత్సవాన్ని సోమవారం నిర్వహించగా ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయానికి 85 ఏళ్ల చరిత్ర ఉందని, ఇప్పుడు రూ. 3.50 కోట్లతో నిర్మించబోతున్నట్లు పునః నిర్మాణ కమిటీ బాధ్యులు వివరించారు. అనంతరం ఎంపీ రఘురాం రెడ్డి స్పందిస్తూ తన సహకారం ఉంటుందని ప్రకటించాగా కమిటీ వారు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడల కళావతి, కాంగ్రెస్ నాయకులు ఊకంటి గోపాలరావు, కొప్పుల చంద్రశేఖర్, కోసూరి శ్రీను, ఆలయ పున:ప్రతిష్ట కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

4 | నేటి శుభోదయ | మంగళవారం | హైదరాబాద్ | 08 - 09 - 2026 | www.netisubhodaya.com



# రాష్ట్రస్థాయి ఫుట్బాల్ లో మల్లెమడుగు విద్యార్థినీలకు కాంస్య పతకాలు

## - పిడి కృష్ణయ్యకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు





**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07:** సెప్టెంబర్ 4 నుండి 6 వరకు నిజాంబాద్ లో జరిగిన జూనియర్స్ అండర్ 16 ఇయర్స్ బాలికల రాష్ట్రస్థాయి ఫుట్బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్లెమడుగు విద్యార్థినిలు కె అనిత, టి నవ్య శ్రీ, ఏ వెన్నెల, ఎస్కె నసీమ, వి పల్లవి, కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సాంబమూర్తి, పిడి బియ్యని కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. అదేవిధంగా సెప్టెంబర్ 6న ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును బియ్యని కృష్ణయ్య పిడి కి అందజేసినట్లు వారు తెలియజేశారు. కృష్ణయ్య పిడి క్రీడారంగంలో ఎందరో విద్యార్థులను జాతీయ రాష్ట్ర స్థాయిల లో విజయాలు సాధించుటలో కృషి చేస్తున్నందుకు గాను, జాతీయ స్థాయికి ఖో-ఖో లో చంద్రిక ఫుట్బాల్ లో యువ వర్షిని ,రాష్ట్రస్థాయి ఫుట్బాల్లో రెండు బంగారు పథకాలు , 11 కాంస్య పథకాలు, నాలుగు వెండి పథకాలు, సాధించినట్లు వారు తెలియజేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు కె. అనిత, ఫుట్బాల్ లో రాష్ట్రస్థాయి సీఎం కప్ లో బంగారు పతకం, రాష్ట్రస్థాయి ఫుట్బాల్ సబ్ జూనియర్స్ లో ఒక వెండి పథకం, జూనియర్స్ లో రెండు కాంస్య పథకాలు, మరియు టీ నవ్య శ్రీ గత సంవత్సరం రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఫుట్బాల్ లో వెండి పతకం ఈ సంవత్సరంలో జూనియర్స్ ఫుట్బాల్ లో రాష్ట్ర స్థాయిలో కాంస్య పథకం సాధించి పాఠశాలకు మంచి పేరు తెచ్చుతున్న విద్యార్థులను అలాగే పాఠశాల పిడి కృష్ణయ్యను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షులు అలివేణి,గ్రామ పెద్దలు నూకారపు వెంకటేశ్వరరావు, భోజర్ల సూర్యం, పీట్ల కృష్ణమూర్తి, కృష్ణ,మనోజ్, సైదులు మాజీ కార్పొరేటర్లు నిరంజన్ కుమార్, లలితా రాణి, జానీ మియా, బట్ట పోతుల సతీష్, పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణవేణి శారద హేమలత సుధాకర్ స్వర్ణలత బ్రహ్మాచారి దేవమనమ్మ వెంకటేశ్వర్లు అరుణ సుజాత బలమని సహదేవ్ రాజకుమారి నవీన్ ఉపేందర్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

# సమాజ ప్రగతిలో విద్యదే అగ్రస్థానం



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ఏ సమాజం అభివృద్ధి చెందాలన్నా విద్యనే కీలక పాత్ర వహిస్తుందని యస్ఆర్ అండ్ బిజీ యన్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నల్లమోతు తిరుమలరావు, వి.ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం కళాశాల భూరి విరాళ దాత గెంటేల నారాయణ రావు వర్ధంతి సందర్భంగా కళాశాల లోఆయన విగ్రహంకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గెంటేల నారాయణ రావు లాంటి వారు చేసిన త్యాగం వల్లనే ఈరోజు ఈ కళాశాల నుండి లక్షలాది మంది విద్యార్థులు కు ఉపాధి అవకాశం లభించడంతో పాటు,దేశ, విదేశాల్లో కళాశాల కళాశాల విద్యార్థులు సేవలు అందిస్తున్నారని అన్నారు.ఈ కళాశాల ఖ్యాతి ఖండాంతరాలకు వ్యాప్తి చెందిందని అన్నారు. ప్రభుత్వాలైనా,వ్యక్తులైనా విద్యా రంగం పట్ల చూపే శ్రద్ధ వలననే కుటుంబాలు, సమాజం, తద్వారా దేశం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని అన్నారు.విద్యపట్ల ఆయా ప్రభుత్వాలు అనుసరించే తీరును బట్టి ఆయాప్రభుత్వాల పని తీరు అంచనా వేయవచ్చునని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టో లో వాగ్దానం చేసిన విధంగా యస్ఆర్ అండ్ బిజీ యన్ ఆర్ కళాశాల ను తక్షణమే యూనివర్సిటీ గా అఫ్ గ్రేడ్ చేయాలని కోరారు. పాత కూరగాయలు మార్కెట్ స్థలం కళాశాల పిజీ తరగతులకు అప్పగించాలని, జిల్లా కోర్టును కొత్త ప్రదేశం కు తరలించే పక్షంలో కోర్టు భవనాలను కళాశాలకు అప్పగించి న్యాయ కళాశాల అందులో ఏర్పాటు చేసి,న్యాయం విద్య ను జిల్లా ప్రజలకు అందుబాటులో కి తేవాలని వారు కోరారు.అక్టోబర్ 16న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరపటానికి నిర్ణయం జరిగిందని అన్నారు. అందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమం లో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు మణి భూషణా చారి,ఆర్.సుదర్శన్, దగ్గుల మాధవరెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. గెంటేల నారాయణ రావు వర్ధంతి ని పురస్కరించుకొని కళాశాల విద్యార్థులకు నారాయణ రావు జీవిత విశేషాలు పుస్తకాలు పంపిణీ చేశారు.

# 48వ డివిజన్లో ఉచితంగా మంచి నీటి సరఫరా

## - తోట రామారావు





**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ఖమ్మం నగరంలో గల 48వ డివిజన్ లో గత మూడు రోజులుగా మిషన్ భగీరథ పైప్లైన్ మరమ్మతుల కారణంగా మంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేషన్ అధికారులు ఇప్పటివరకు ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజల ఇబ్బందులను గుర్తించిన స్థానిక మాజీ కార్పొరేటర్ తోట రామారావు స్పందించారు. డివిజన్ పరిధిలోని అంబేద్కర్నగర్, పద్మావతి నగర్,వెంకటేశ్వర నగర్, సారధి నగర్, గణేష్ నగర్ ప్రాంతాలలో తమ సొంత ట్యాంకర్ ద్వారా ఉచితంగా మంచి నీటిని ప్రజలకు సరఫరా చేశారు. దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలకు కొంత ఉపశమనం లభించింది.ఈ సందర్భంగా తోట రామారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని, మూడు రోజులుగా నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. త్రీ టౌన్ ప్రాంతానికి ఆయుపట్టుగా ఉన్న రంగనాయకుల గుట్ట నీటి చప్టాను కూడా అనాలోచితంగా కూల్చివేశారని. దీనివల్ల భవిష్యత్తులో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని. దీనిపై ప్రభుత్వ అధికారులు పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికైనా అధికారులు మిషన్ భగీరథ పైప్లైన్ తక్షణమే మరమ్మతులను పూర్తి చేసి, నీటి సరఫరా నిలిచిపోయిన ప్రాంతాలకు ప్రభుత్వం నీటి సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఏర్పడకుండా ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చేతి కృష్ణ, ఎ.కే. బాబా కృష్ణ నాయక్, నిరంజన్, లింగారెడ్డి, తోట రమేష్, వేల్పుల శ్రీనివాస్, చింటూ, కుమారి, సైదమ్మ, రమాదేవి, నాగమణి పాల్గొన్నారు.

# అసెంబ్లీ తొలిరోజే ప్రజాస్వామ్యానికి చీకటి రోజు

## - బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల అరెస్టు అప్రజాస్వామికం: రవీందర్ యాదవ్



**కేశంపేట, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు అత్యంత దుర్మార్గంగా, అప్రజాస్వామికంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకోవడం, తోపులాటకు దారితీయడం, అనంతరం కేటీఆర్, హరీశ్రావు సహా పలువురు ఎమ్మెల్యేలను అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన విమర్శించారు.మహిళా ప్రజాప్రతినిధులతో పోలీసులు వ్యవహరించిన తీరు మరింత బాధాకరమని రవీందర్ యాదవ్ అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన మహిళా ఎమ్మెల్యేలను గౌరవించకుండా అడ్డుకోవడం, నెట్టివేయడం వంటి ఘటనలపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రతిపక్షం ప్రజా సమస్యలను, ఎన్నికల హామీల అమలును, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను పోలీసుల ద్వారా అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ఆరోపించారు. "ప్రశ్నిస్తే అరెస్ట్.. నిలదీస్తే కేసులు.. ప్రజల కోసం పోరాడితే అణచివేత" విధానాన్ని ప్రభుత్వం విడనాడాలని సూచించారు.కేటీఆర్, హరీశ్రావు సహా అదుపులోకి తీసుకున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను వెంటనే విడుదల చేయాలని, మహిళా ప్రజాప్రతినిధులతో అనుచితంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ జగదీశ్వర్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమాజ సేవలో సంతోష్ కుమార్ మరింత ఎదగాలి

## - సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్



**కేశంపేట, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** కేశంపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వీరమల్ల సంతోష్ కుమార్ను కొండారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ మాట్లాడుతూ,, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా సంతోష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. సంఘం అభివృద్ధితో పాటు సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, సమాజ సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి, ఆర్యవైశ్య సమాజానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. భవిష్యత్తులో సంతోష్ కుమార్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.అధ్యక్షుడిగా తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘ సభ్యులందరికీ వీరమల్ల సంతోష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుల సహకారంతో సంఘ అభివృద్ధి, సమాజ సంక్షేమ కార్యక్రమాలకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బాణాల శ్యాం కుమార్, బుర్రి మల్లేష్ గౌడ్, మావిళ్ల రమేష్, పరిగి అశోక్, కొత్తపేట శంకర్ పాల్గొన్నారు.

# ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి.

## 06 గ్యారంటీలు, 420 హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: ఆకోజు సునీల్ కుమార్...



**భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో భాగంగా సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకులు ఆకోజు సునీల్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల దగా పాలనను ఎండగడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ సీనియర్ నాయకులు కోటగిరి ప్రమోద్ కుమార్, తుమ్మలపల్లి ధనేశ్వరరావు, రేపాక పూర్ణచంద్రరావు, కొండముక్కల సాయిబాబా, బద్ది బాబి, అయినాల రామకృష్ణ, తాండ్ర ప్రసాద్, పంజా సునీల్ కాంత్, గోసుల వెంకట శ్రీనివాస్, రావూరి రవి కిరణ్, కొల్లిపాక శివ, రోహిత్ పాషా, అందుర్తి వెంకటరావు, బత్తుల నరసింహులు, దానియేలు ప్రదీప్, రుద్రరామరాజు, చిట్టిమళ్ళ అనిల్, బాసిపోయిన మోహన్ రావు, మహిళా నాయకులు కనితి రాదా, ఏనిక శిరీష, ప్రియాంక, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

Neti Shubodyaa 08.09.2026_Layout 1 9/8/2026 7:12 AM Page 5



## అసెంబ్లీ స్పీకర్ ను తాత మధు అవమానించడం తగదు

### - కాంగ్రెస్ సీనియర్ నేత వడ్డేబోయిన నరసింహారావు

**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** దళిత వర్గానికి చెందిన తెలంగాణ రాష్ట్ర స్పీకర్ మీద తాతా మధు తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయనను బర్తరఫ్ లేదా సస్పెన్షన్ చేయాలని చట్టసభలలో హుందాతనంగా ఉండవలసిన సభ్యులు దిగజారి ప్రవర్తిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ వడ్డేబోయిన నరసింహారావు తెలిపారు. ఆయన సోమవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. తాతా మధు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వ్రాయటానికి ,చెప్పటానికి వీలు లేని భాషను మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాల వారు అంటేనే రాజకీయాల్లో ఉండటానికి వీలు లేదనే విధంగా వ్యవహరిస్తున్నారని, రాజకీయాల్లో మేమే ఉండాలి, పదవులు మేమే అనుభవించాలి అనే భావనతో వుంటున్న ఇలాంటి వారిని శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పించి, ఇటువంటి వారి పట్ల కఠినంగా ఉండి, సమాజానికి మంచి సందేశం పంపించే విధంగా చట్ట సభలు తీర్మానం చేయాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం,నాయకులు కూడా ఈ విషయంలో స్పందించి తగు చర్య తీసుకొని ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ వర్గాల పట్ల గౌరవం కాపాడుకోవాలని లేని పక్షంలో వ్యతిరేక భావనను పెంచుకొన్న వారు అవుతారని తెలియచేశారు.

## సిరికొండ మండలం

## కొండాపూర్‌లో జెండా గద్దె వివాదం

### - గ్రామస్తులు, బంజారాల మధ్య తోపులాట, పోలీసుల లాఠీఛార్జ్



**నిజామాబాద్ రూరల్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని కొండాపూర్ గ్రామంలో జెండా గద్దె నిర్మాణం వివాదాస్పదంగా మారింది. స్థానిక బంజారాలు, గ్రామస్తుల మధ్య నెలకొన్న అభిప్రాయ భేదాలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి.గతంలో కొండాపూర్ ఉమ్మడి గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో బంజారా భవన నిర్మాణానికి గ్రామకంఠం భూమిని కేటాయించారు. తర్వాతి కాలంలో తండాలు ప్రత్యేక పంచాయతీలుగా విడిపోయినప్పటికీ, బంజారా భవనం వారి ఆధీనంలోనే ఉంది. బంజారా భవనం ముందున్న ఖాళీ గ్రామకంఠం స్థలాన్ని ఆక్రమించేందుకు దేవుడి జెండా గద్దె పేరిట నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముగ్గులు పోసి గద్దె నిర్మాణ పనులు ప్రారంభించగా,గ్రామస్థుల అభ్యంతరం తెలుపడంతో గ్రామ కార్యదర్శి (సెక్రటరీ) అక్కడికి చేరుకుని ఎలాంటి అనుమతులు లేనందున పనులు నిలిపివేయాలని ఆదేశించారు. కార్యదర్శి హెచ్చరికలతో పనులు ఆపినప్పటికీ, తిరిగి రాత్రికి రాత్రే జెండా గద్దెను నిర్మించేందుకు యత్నించినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని రాత్రంతా కాపలాగా ఉన్నా ఉదయన్నే నిర్మించిన గద్దెపై బంజారాలు పూజలు నిర్వహించేందుకు ప్రయత్నించగా, గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాట, ఉద్రిక్తత చోటుచేసుకుంది.పరిస్థితి చెయ్యిదాటి విషమంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు లాఠీఛార్జ్ చేశారు. ప్రస్తుతం గ్రామంలో ముందస్తు జాగ్రత్తగా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు ఈ పరిస్థితి ని ప్రత్యేకంగా పర్యవేశించిన సి ఐ బిక్షపతి, సిరికొండ తహసీల్దార్ రవీందర్ రావు, ఎస్ ఐ రామకృష్ణ లు పరిస్థితితులు చల్లాబడిన తర్వాత ఇరు వర్గాలతో చర్చించి ఈ విషయాన్నీ సానుకూలంగా పరిష్కరిచుకోవాలని సూచించాగా ఇరువర్గాలు శుక్రవారం చర్చించుకుందామని ఒప్పందానికి వచ్చారు

## ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్–మల్కాజిగిరి, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, పౌరసరఫరాలు, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 105 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారుల ఫిర్యాదులను ప్రాధాన్య క్రమంలో పరిశీలించి, వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా, నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టి బాధితులకు సత్వర ఉపశమనం కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.కార్యక్రమంలో డీఆర్ఓ మాలతి, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## బచ్చన్ స్కూల్లో ఉపాధ్యాయులకు అవార్డుల ప్రధానోత్సవం

- బచ్చన్ స్కూల్ ఛైర్మన్ రమేష్ రెడ్డి, స్కూల్ డైరెక్టర్ శిరీష.
- స్కూల్ ప్రిన్సిపల్ తులసి లక్ష్మికి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు ప్రధానం
- వ్యాయామ ఉపాధ్యాయుడిగా బెస్ట్ టీచర్ అవార్డు ఎమ్మె గణేష్

**ఇబ్రహీంపట్నం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** యాచారం మండల పరిధిలోని మాన్ పట్టణ కేంద్రంలో సెప్టెంబర్ ఐదున జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్కూల్ ఛైర్మన్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ,మన బాచుపల్లి స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ,ఇంకా బాగా విద్యార్థులకు విద్యను నేర్పి, మంచి గుర్తింపు తెచ్చుకోవాలని,విద్యార్థుల పట్ల మంచి అభిప్రాయంతో,వాళ్ల భవిష్యత్తును ముందు తరాలకు అందించాలనికోరుకుంటున్నాను అన్నారు.ప్రధానఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా బచ్చన్ స్కూల్ ఛైర్మన్ రమేష్ రెడ్డి,డైరెక్టర్ శిరీష,స్కూల్ ప్రిన్సిపాల్ తులసి లక్ష్మీ టీచర్స్ కి సన్మానం చేయడం జరిగింది. అదేవిధంగా స్కూల్ పిఈటి ఎమ్మె గణేష్ బెస్ట్ టీచర్ గా గుర్తించారు.ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వై.వి. రావు,అకడమిక్ కోఆర్డినేటర్ సుధీర్ పాల్గొన్నారు.




## స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు ఖండించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్

**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07:** తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తీవ్రంగా ఖండించారు. స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకి, వ్యక్తికి సంబంధించినది కాదని, అది శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలను అ వ మానించ డ మేన న్నారు. రాజకీయంగా విభేదాలు ఉండొచ్చని, కానీ రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని కించపరిచేలా వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. “స్పీకర్‌ను అవమానించడం అంటే శాసనసభ గౌరవాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమే” అని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు.తాతా మధు తన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని తెలంగాణ శాసనసభ స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.



## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం : సంచిత్ గంగ్వార్

**మల్కాజిగిరి, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం దోహదపడుతుందని సంచిత్ గంగ్వార్ అన్నారు. మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సర్కిళ్లకు చెందిన ప్రజల నుంచి మొత్తం 27 ఫిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన వెంటనే వాటిని సంబంధిత శాఖలకు పంపించి, నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మల్కాజిగిరి సర్కిల్ నుంచి 7, మౌలాలి నుంచి 1, కీసర నుంచి 19 ఫిర్యాదులు అందగా.. బోయిన్‌పల్లి, అల్వాల్ సర్కిళ్ల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పేర్కొన్నారు.ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా



చర్యలు చేపట్టాలని అన్నారు.కార్యక్రమంలో ఎస్ఈ లక్ష్మణ్, డీడీ (యూబీడీ) బి. శ్రీధర్‌రావు, డీఈఈ టి. ప్రశాంతి, వెటర్నరీ ఆఫీసర్ టి. సంజయ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండించిన మాజీ ఎంపీ నామ

### - బీఆర్ఎస్ నిరసనను అడ్డుకోవడం అప్రజాస్వామికం : మాజీ ఎంపీ నామ

**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07:** అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసుల అత్యుత్సాహం అప్రజాస్వామికమని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాయడం కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ వద్ద నల్ల దుస్తులు ధరించి నిరసనకు దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు బలవంతంగా అడ్డుకోవడం, అరెస్టు చేయడాన్ని మాజీ ఎంపీ నామ తీవ్రంగా ఖండించారు. అరెస్టు సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. పోలీసుల బలప్రయోగం, తోపులాటల కారణంగా కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి స్వల్ప గాయాలు కావడం శోచనీయమన్నారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన తోపులాటలో మాజీ మంత్రి హరీశ్‌రావు కిందపడేలా చేయడం పోలీసుల వ్యవహార శైలికి నిదర్శనమని విమర్శించారు. మహిళా సాధికారత గురించి గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం, మహిళా ఎమ్మెల్యేలైన సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి పట్ల చూపుతున్న గౌరవం ఇదేనా అని నామ ప్రశ్నించారు. మహిళలకు గౌరవం ఇస్తామని చెప్పే కాంగ్రెస్, మహిళా ప్రజాప్రతినిధులనే ఈ విధంగా బలవంతంగా లాక్కెళ్లడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలు ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారన్న భయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై అరెస్టులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మాజీ ఎంపీ నామ ఆరోపించారు. ప్రతిపక్షం నిరసన తెలిపే హక్కును కూడా హరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. “కేంద్రంలో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసనలు చేస్తే అది ప్రజాస్వామ్యం తెలంగాణలో ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ నాయకులు నిరసన చేస్తే అరెస్టులు ఎందుకు?”



అని ఆయన ప్రశ్నించారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌కు నల్ల చొక్కా ధరించి వెళ్లి నిరసన వ్యక్తం చేస్తే తప్పులేదని భావించే కాంగ్రెస్ నాయకత్వం, తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలపడానికి ఎందుకు అడ్డంకులు సృష్టిస్తోందని నిలదీశారు. “కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలో ఒక న్యాయం.. తెలంగాణలో మరో న్యాయమా? ఇదేనా కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి?” అని మాజీ ఎంపీ నామ ప్రశ్నించారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల గొంతును పోలీసు బలగాలతో నొక్కివేయాలని ప్రయత్నిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కొనసాగుతున్న అణచివేత ధోరణికి తగిన సమయంలో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

6

నేటి శుభోదయ

మంగళవారం | హైదరాబాద్

08 - 09 - 2026

www.netisubhodaya.com



# ల్యాబ్ టెక్నీషియన్ మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలి....




**సిద్దిపేట, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07:** సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ పవన్ మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బీఎల్‌పీ) సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తలారి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం బీఎల్‌పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో తీవ్ర అభద్రతా భావం నెలకొందన్నారు. ఒకవైపు నెలల తరబడి వేతనాలు అందక పోవడం, మరోవైపు ఉద్యోగ భద్రత లేకపోవడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. పదేళ్లు, పదిహేనేళ్లుగా పనిచేస్తున్న ప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమన్నారు.ఇటీవల ఆస్పత్రిలో శానిటేషన్ ఉద్యోగినిపై లైంగిక దాడి ఆరోపణల ఘటన మరువకముందే ల్యాబ్ టెక్నీషియన్ పవన్ ఆత్మహత్యకు పాల్పడటం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఆస్పత్రిలో కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్న చల్ల శ్రీనివాస రెడ్డిపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే కాంట్రాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తొలగించిన ల్యాబ్ టెక్నీషియన్లందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అలాగే ఆస్పత్రి సూపరింటెండెంట్ పనితీరుపైనా సమగ్ర విచారణ జరిపి, ఆస్పత్రిలో ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో బీఎల్‌పీ నాయకులు దబ్బేట ఆనంద్, దబ్బేట భగవాన్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



**నేరెడ్ మెట్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచనల మేరకు ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ జోనల్ కమిషనర్ సాంచిత్ గంగ్వార్ ఐఏఎస్‌ను కలిసి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. కౌకూర్–189 డివిజన్ యాప్రాల్ పరిధిలోని ప్రజల సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.కౌకూర్ మెయిన్ రోడ్డు నుంచి యాప్రాల్ హనుమాన్ ఆలయం వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఒక వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా సమల లక్ష్మీనగర్ కాలనీలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సీసీ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ మరో వినతి పత్రాన్ని సమర్పించారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని జోనల్ కమిషనర్‌ను కోరారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రజల అవసరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం లభించే వరకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారి లక్ష్మణ్ యాదవ్, వెంకటేష్ యాదవ్, వీణ సతీష్, హనుమాన్ చారి, సందీప్‌రెడ్డి, రమేష్ చారితో పాటు కాలనీ ప్రజలు రామారావు, తుషాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి నియోజకవర్గం ఎస్సీ విభాగం జనరల్ సెక్రటరీగా ప్రవీణ్ జాన్సన్



**నేరెడ్ మెట్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో మల్కాజిగిరి నియోజకవర్గం ఎస్సీ విభాగం జనరల్ సెక్రటరీగా పి. ప్రవీణ్ జాన్సన్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ కావలి చంద్రయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ విభాగం అభివృద్ధికి ప్రవీణ్ జాన్సన్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం జాయింట్ సెక్రటరీ మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారం, మార్గదర్శకత్వంతో మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ప్రవీణ్ జాన్సన్ తెలిపారు. ఎస్సీ వర్గాల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు.

# సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఉన్నత విద్యాశాఖ కమిషనర్, ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ దేవసేన

**- ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా"ఇన్యూమరేషన్ నో మ్యాపింగ్ నోటీసుల ప్రక్రియపై పరిశీలన**



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో జరుగుతున్న ఎస్ఐఆర్–2026 ప్రక్రియలో భాగంగా ఇన్యూమరేషన్, నో మ్యాపింగ్ నోటీసులకు సంబంధించిన ప్రక్రియను ఉన్నత విద్యాశాఖ కమిషనర్, ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ దేవసేన పరిశీలించారు.ఈ సందర్భంగా ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు చేపడుతున్న ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నో మ్యాపింగ్, ఇన్యూమరేషన్‌కు సంబంధించిన వివరాలను యాప్‌లో ఏ విధంగా అప్‌లోడ్ చేస్తున్నారు, ఓటర్ల నుంచి ఏయే ఫారాలు, ఆధారాలు, పత్రాలు స్వీకరిస్తున్నారు, వాటిని ఓటర్లకు ఏ విధంగా వివరిస్తున్నారు అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు.అలాగే బీఎల్ఓలు ఓటర్లు సమర్పించిన వివరాలు, పత్రాలను ఏ విధంగా వెరిఫై చేస్తున్నారు, అనంతరం ఏఈఆర్ఓలు వాటిని పరిశీలించి సంబంధిత లాగిన్‌లో ఏ విధంగా క్లియర్ చేస్తున్నారు అనే ప్రక్రియను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఓటర్లతో నేరుగా మాట్లాడిన దేవసేన ఎందుకు విచారణకు వచ్చారు, తమ వివరాల్లో ఏమైనా తప్పులు ఉన్నాయా, ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు సమర్పించిన వివరాలు, పత్రాలపై వారి సందేహాలను కూడా తెలుసుకున్నారు.అర్హత కలిగిన ప్రతి ఓటరు తుది ఓటరు జాబితాలో ఉండేలా, ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

# శాసనసభ్యులపై పోలీసుల దౌర్జన్యం దుర్మార్గం : చైతన్య కిరణ్



**వికారాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు వ్యతిరేకంగా గన్‌పార్క్ నుంచి అసెంబ్లీకి నిరసనగా వెళ్తున్న బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులపై పోలీసులు వ్యవహరించిన తీరును బీఆర్ఎస్ నాయకుడు, లీగల్ సెల్ అడ్వకేట్, యువ చైతన్య ట్రస్ట్ చైర్మన్ ఎం. చైతన్య కిరణ్ తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా చైతన్య కిరణ్ మాట్లాడుతూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి, ఆమె చీర లాగి అవమానించడం తీవ్రంగా ఖండించాల్సిన ఘటన అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీ గేట్ వద్దే అరెస్టు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించిన ఆయన, పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా వికారాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# రైతుల సేవే లక్ష్యంగా రైతు విశ్రాంతి భవనం నిర్మిస్తాం

**వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్**



**వికారాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** రైతులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ వారి సేవే లక్ష్యంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ముందుకు సాగుతుందని వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ అనుమతితో సోమవారం వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం మూడో సమావేశం చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వైస్ చైర్మన్ మల్లేశం, పాలకవర్గ సభ్యులు వివిధ అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.రైతులు తమ ధాన్యాన్ని మార్కెట్‌లో విక్రయించిన అనంతరం వివిధ కారణాలతో స్వగ్రామాలకు వెళ్లడంలో ఆలస్యం కావడం, తూకాలు పూర్తికావడానికి సమయం పట్టడం వంటి సందర్భాల్లో ఇబ్బందులు పడుతున్నారని సమావేశంలో చర్చించారు. ఈ నేపథ్యంలో రైతులు రాత్రివేళల్లో బస చేసేందుకు వీలుగా మార్కెట్‌యార్డులో రైతు విశ్రాంతి భవనం నిర్మించాలని పాలకవర్గం తీర్మానం చేసింది.అదేవిధంగా మార్కెట్ కమిటీకి చెందిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా రక్షణ గోడలు నిర్మించాలని, రైతులు విశ్రాంతి తీసుకునేందుకు మార్కెట్‌యార్డులో బెంచీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. త్వరలోనే శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చైర్మన్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.సమావేశం అనంతరం మార్కెట్‌యార్డులో రైతులతో కలిసి పాలకవర్గం సభ్యులు ఉచిత భోజన కార్యక్రమంలో పాల్గొని సహపంక్తి భోజనం చేశారు. రైతులకు ఉచిత భోజనం ఏర్పాటు చేయడంపై రైతులు చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, పాలకవర్గ సభ్యులు విజేందర్‌రెడ్డి, ప్రభాకర్, పాండురంగారెడ్డి, రంగారెడ్డి, రమేష్ నాయక్, రాజునాయక్, పాపిరెడ్డి, మిర్యానం సురేష్, నాగిరెడ్డి, భీమయ్య, వట్టం నర్సిములు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ నిరసన

**- చలో అసెంబ్లీకి వెళ్తున్న జక్కని శేఖర్‌ను అడ్డుకున్న పోలీసులు**



**షాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు బీజేపీ షాబాద్ వైస్ ప్రెసిడెంట్ జక్కని శేఖర్ బయలుదేరారు. ఈ సందర్భంగా పోలీసులు ఆయనను అడ్డుకుని సైదాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం నగర బీజేపీ నాయకులతో కలిసి శేఖర్ పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలిపారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. పెండింగ్ నిధుల కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

మంగళవారం | హైదరాబాద్
08 - 09 - 2026
www.netisubhodaya.com
నేటి శుభోదయ



## వెండికొండ సిద్దేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**శంషాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** శంషాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని శ్రీ వెండికొండ సిద్దేశ్వర స్వామి (సిద్దుల గుట్ట) ఆలయంలో నిర్వహిస్తున్న 71వ శ్రీ వెండికొండ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు చేసి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గణేష్ గుప్త, చంద్రారెడ్డి, నీరటి రాజు, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, సర్పంచులు కోటేష్, ప్రసాద్ గౌడ్, లింగం, బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మాటలకే పరిమితమైన పరిగి అభివృద్ధి - ముకుంద నాగేశ్వర్



**వికారాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** పరిగి నియోజకవర్గ అభివృద్ధి ప్రభుత్వాల హామీలు, శిలాఫలకాలకే పరిమితమైందని తెలంగాణ ఉద్యమ నాయకుడు, బీజేపీ నాయకుడు ముకుంద నాగేశ్వర్ విమర్శించారు. ప్రాణహిత–చేవెళ్ల, పాలమూరు–రంగారెడ్డి నీటి పథకాలు, లక్నాపూర్ అభివృద్ధి, రైతు బజార్, మోడల్ మార్కెట్ పనులు పూర్తికాలేదన్నారు.పరిగిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గురుకులాలకు శాశ్వత భవనాలు, పాలిటెక్నిక్, ఐటీఐ, కొత్త రెవెన్యూ డివిజన్, మండలాల ఏర్పాటు, కుల్కచర్ల వంద పడకల ఆసుపత్రి వంటి కీలక డిమాండ్లు నెరవేరలేదని తెలిపారు. కొడంగల్‌కు భారీగా నిధులు కేటాయిస్తూ పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. మిగిలిన రెండేళ్లలో పరిగికి అధిక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## పేదింటి బిడ్డకు సింగపూర్ అవకాశం

- దండు మైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
- ఉపాధ్యాయుడు రామకృష్ణకు అరుదైన గుర్తింపు
- మంచాల మండలం యుటిఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ అజ్మత్ ఖాన్.



**ఇబ్రహీంపట్నం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలో దండుమైలారంలో జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు రామకృష్ణకు అరుదైన అవకాశం దొరికిందని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్న మంచాల మండలం యూటీఎఫ్ మండల అధ్యక్షులు అజ్మత్ ఖాన్ మాటల్లో.పేద కుటుంబంలో జన్మించి, ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి, అదే ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూ తన ప్రతిభను నిరూపించుకున్న దండు మైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగణిత శాస్త్ర ఉపాధ్యాయుడు రామకృష్ణకు ఎక్స్పోజర్ విజిట్ లో భాగంగా సింగపూర్ పర్యటించే అరుదైన అవకాశం లభించడం అభినందనీయమని టీఎస్ యుటిఎఫ్ మంచాల మండల అధ్యక్షుడు డాక్టర్ ఆజ్మత్ ఖాన్ అన్నారు.తెలంగాణ ప్రభుత్వం ద్వారా లభించిన ఈ అవకాశాన్ని రామకృష్ణ అందిపుచ్చుకోవడం ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రతిభకు లభించిన గౌరవంగా ఆయన పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు,ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ విద్యనే ఆయుధంగా చేసుకుని ముందుకు సాగిన రామకృష్ణ, నేడు ఉపాధ్యాయ వృత్తిలో తనదైన ముద్ర వేస్తున్నారని తెలిపారు.విద్యార్థుల్లో సృజనాత్మకత,శాస్త్రీయ దృక్పథం, నూతన ఆలోచనా విధానం పెంపొందించడంలో రామకృష్ణ చేస్తున్న కృషి ప్రశంసనీయమని డాక్టర్ ఆజ్మత్ ఖాన్ అన్నారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు కూడా అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు లభిస్తాయని రామకృష్ణకు దక్కిన సింగపూర్ అవకాశంచాటిచెబుతోందన్నారు.సింగపూర్ పర్యటనలో అక్కడి విద్యా విధానం, బోధనా పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల అభ్యసన విధానాలను పరిశీలించి, అక్కడి ఉత్తమ విధానాలను తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసేందుకు రామకృష్ణ కృషి చేయాలని ఆకాంక్షించారు."పేదింటి బిడ్డగా మొదలైన రామకృష్ణ ప్రయాణం,ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా ఎదిగి,ఇప్పుడు సింగపూర్ వరకు చేరుకోవడం ఎంతోమంది విద్యార్థులకు, యువతకు స్ఫూర్తిదాయకం.ఇది రామకృష్ణ వ్యక్తిగత విజయమే కాకుండా, ప్రభుత్వ విద్యా వ్యవస్థకు దక్కిన గౌరవం" అని డాక్టర్ ఆజ్మత్ ఖాన్ పేర్కొన్నారు.రామకృష్ణ సింగపూర్ పర్యటన విజయవంతం కావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తెలంగాణ ప్రభుత్వ విద్యకు మరింత పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సమావేశంలో మంచాల మండల టీఎస్ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి తుల్జా రామ్, కోశాధికారి ప్రభు,ఉపాధ్యక్షులు మండల యాదయ్య,శ్యామల,మజరుల్లాఖాన్, జిల్లా కౌన్సిలర్లు మోతిలాల్, వెంకట్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## తాతా అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నేత నూతి



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఖమ్మం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ రావు చేసిన అనుచిత వ్యాఖ్యలను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న ఒక ఉన్నత నాయకుడిని ఉద్దేశించి ఇలాంటి అహంకారపూరితమైన, బాధ్యతారాహిత్యమైన మాటలు మాట్లాడటం తాతా మధుసూదన్ రావు అపరిపక్వతకు నిదర్శనమని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన స్పీకర్ స్థానానికి ఒక గౌరవం ఉందని, ఆ గౌరవాన్ని మంటగలిపేలా వ్యవహరించడం శోచనీయమని విమర్శించారు. దళిత వర్గానికి చెందిన నాయకుడు ఉన్నత స్థానంలో ఉండటాన్ని ఓర్వలేకనే ఇలాంటి చౌకబారు విమర్శలకు దిగుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకులు విచక్షణ కోల్పోయి అహంకారంతో మాట్లాడుతున్నారని, రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులపై నోరు పారేసుకుంటే కాంగ్రెస్ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. తాతా మధుసూదన్ రావు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్ గడ్డం ప్రసాద్ కి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని నూతి సత్యనారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ నాయకులపై గానీ, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వ్యక్తులపై గానీ ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు పునరావృతమైతే ప్రజల పక్షాన తగిన బుద్ధి చెబుతామని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## కుకట్‌పల్లిలో శ్రీనివాసనగర్ ప్లాట్ నం.38
### అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు కోరుతున్న నివాసితులు



**కుకట్‌పల్లి, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07:** కుకట్‌పల్లి సర్కిల్, హైదర్ నగర్ డివిజన్ పరిధిలోగల శ్రీనివాసనగర్ నివాసితులు, శ్రీనివాసనగర్ పరిధిలో ఉన్న ప్లాట్ నం. 38 (సర్వే నం.114) వద్ద జరుగుతున్న అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. యజమానికి అనుమతించిన ప్లాన్ ప్రకారం స్టిల్ట్‌తో పాటు మూడు అంతస్తులకే పరిమితం కావాల్సి ఉన్నా, సెట్బ్యాక్ నిబంధనలు పాటించకుండా నిర్మాణం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే అనుమతించిన పరిమితికి మించి అనధికారంగా నిర్మాణం చేస్తున్నారని చెబుతున్నారు.ఇది వరకు GHMC చర్యలు తీసుకుని నిర్మించిన గోడలను కూల్చి వేసినా, యజమాని మళ్లీ నిర్మాణ పనులు ప్రారంభించారని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లంఘన గుర్తించి చర్య తీసుకున్న తర్వాత కూడా నిర్మాణం తిరిగి ఎందుకు కొనసాగిస్తున్నారని అర్థం కావడం లేదని, ఇప్పుడు అదనంగా మరిన్ని అంతస్తులు జోడించాలనే ప్రయత్నాలు కనిపిస్తున్నాయని వారు అంటున్నారు. పబ్లిక్ సేఫ్టీ దృష్ట్యా వెంటనే పనులను ఆపించి, అనుమతి లేని భాగాలను పూర్తిగా తొలగించాలని కోరుతున్నారు.ఇటీవలే గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో అనుమతి లేని ఏడు అంతస్తుల భవనం కూలి మరణాలు సంభవించిన విషయం నివాసితులకు గుర్తుంది. ఆ ఘటన తర్వాత సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అక్రమం, ప్రమాదకరంగా ఉన్న నిర్మాణాలపై కూల్చివేత డ్రైవ్‌లను మరింత పెంచారని చెబుతున్నారు. కుకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ వంటి ప్రాంతాల్లో చిన్న ప్లాట్లలో కూడా సెట్బ్యాక్ ఉల్లంఘనలు గుర్తించి చర్యలు తీసుకున్నారని, అందుకే హైదర్‌నగర్ కేసును కూడా అదే రీతిలో చూడాలని స్థానికులు కోరుతున్నారు.కుకట్‌పల్లి సర్కిల్‌లో అధికారులు న్యాయంగా, వేగంగా, బాధ్యతతో చర్యలు తీసుకోవాలని నివాసితులు అభ్యర్థిస్తున్నారు. అనుమతి లేని నిర్మాణ భాగాలను వెంటనే కూల్చివేయడంతో పాటు, మరింత నిర్మాణం జరగకుండా పూర్తిగా నియంత్రణ ఉండేలా చూడాలని, అనుమతి ఆర్డర్, భవన నిబంధనలకు వ్యతిరేకంగా అదనపు అంతస్తులు చేర్చకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ
### - మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్





**వికారాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07:** అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరును నిరసిస్తూ వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని మోమిన్‌పేట్ మండల కేంద్రంలో శాంతియుత నిరసన ర్యాలీ, మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు గట్టు రామచంద్ర రావుతో కలిసి మెతుకు ఆనంద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మెతుకు ఆనంద్ మాట్లాడుతూ, నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకుని అరెస్టు చేయడం ప్రభుత్వ నియంతృత్వానికి నిదర్శనమన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు వస్తున్న ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం దారుణమన్నారు. ముఖ్యంగా అసెంబ్లీ వద్ద మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమని మండిపడ్డారు. మహిళా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని, గొంతు పిసికి, దారుణంగా ఈడ్చుకెళ్లడం కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చే గౌరవమా అని ప్రశ్నించారు. అలాగే మాజీ మంత్రి సునీత లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగడం అత్యంత దారుణమని, ప్రస్తుత అసెంబ్లీ గౌరవ సభలా కాకుండా కౌరవ సభలా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒకవైపు అసెంబ్లీకి రండి అని చెబుతూనే, మరోవైపు ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు వస్తే అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పోలీసులు ఇష్టం వచ్చినట్లు చేతులు పట్టుకుని లాగడం, కింద పడేసి తొక్కడం వంటి ఘటనలపై కచ్చితంగా ఫిర్యాదు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకునేలా పోరాడతామని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, అగ్రవర్ణాల్లోని పేదలకు ఇచ్చిన హామీల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు.అధికారుల తప్పిదాల వల్ల 22A నిషేధిత జాబితాలో పడిన భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారుల ఒక్క సంతకంతో ఆ భూములను తొలగించే అవకాశం ఉన్నప్పటికీ, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ వేధిస్తుండటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

Neti Shubodyaa 08.09.2026_Layout 1 9/8/2026 7:12 AM Page 8



# యస్.బి.ఐ.టి. లో ప్రారంభమైన 18 రోజుల టెస్ట్ ఇంజినీర్ శిక్షణా తరగతులు

**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ప్రముఖ సాఫ్ట్ వేర్ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ వారి కాగ్నిజెంట్ ఫౌండేషన్, ఐ.సి.టి అకాడమీ సంయుక్తంగా నిర్వహించే 18 రోజుల టెస్ట్ ఇంజినీర్ శిక్షణా తరగతులు సోమవారం ఘనంగా ప్రారంభమైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి.ఎస్.ఆర్) లో భాగంగా తమ కళాశాలలో ఎంపికచేసిన విద్యార్థినులకు టెస్ట్ ఇంజినీర్ శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ తరగతులు సోమవారం నుండి 18 రోజుల పాటు జరుగుతాయి అని ఆయన తెలియజేశారు.టెస్ట్ ఇంజినీర్ శిక్షణ లో విద్యార్థినిలకు ఆటోమేటెడ్ టెస్టింగ్, మాన్యువల్ టెస్టింగ్, సెలీనియం వంటి ఆధునిక అంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తారని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ జి . ధాత్రి తెలిపారు. టెక్ ఫర్ ఆల్ ఫేజ్ త్రీ లో భాగంగా తమ కళాశాలని ఎంపిక చేసి తమ విద్యార్థినులకు ఉచితంగా శిక్షణను అందిస్తున్న ఐ.సి టి అకాడమీ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల లో ఎంపిక చేసిన 65 మంది విద్యార్థినులు ఈ శిక్షణలో పాల్గొంటారని, శిక్షణ అనంతరం కాగ్నిజెంట్ ఫౌండేషన్ నుండి సర్టిఫికెట్ అందుకుంటారని కళాశాల వైస్ చైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు.తమ కళాశాలలో అకడమిక్స్ తో పాటు ఉద్యోగాలకు సిద్ధం చేసే శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని, తద్వారా గ్రాడ్యుయేషన్ అనంతరం ఉద్యోగానికి అన్ని విధాల తమ విద్యార్థినులకు అవకాశాలను అందించుకునేలా తయారు చేశామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ. సి. టి. డి. జీ. ఏం. ఎన్.అమర్నాథ్, ఫీల్డ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బూర దినేష్ తో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, టి.పి.ఒ. డాక్టర్ యన్. సవిత, డాక్టర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణికి 116 ఫిర్యాదులు



**నిజామాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 116 ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,జెడ్పీ సీఈఓ సాయాగౌడ్,డీఆర్డీఓ సాయన్న,డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యం

**- జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీ దేవసేన**

**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన తెలిపారు.ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ ప్రతి అధికారికి అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు ఎటువంటి ప్రధాన సమస్యలు గుర్తించలేదని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలు, ఓటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, సందేహాలను రాజకీయ పార్టీల ప్రతినిధుల ద్వారా తెలుసుకోవడమే ఎన్నికల సంఘం ఉద్దేశ్యమని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎప్పుడైనా తనను సంప్రదించి సమస్యలను తెలియజేయవచ్చని, చిన్న సమస్య అయినప్పటికీ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.అర్హత లేని ఓటర్లను తొలగించడంతో పాటు, అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండేలా చూడటమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ధృవపత్రాల్లో అవసరమైన ధృవ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని, అధికారులు తమ స్థాయిలో ధృవ పత్రం సమర్పణ నుంచి మినహాయింపు ఇవ్వలేరని పేర్కొన్నారు. వివాహిత మహిళల విషయంలో పేర్ల మార్పులు, పేర్లలో అక్షర దోషాలు, ఇతర చిన్నపాటి క్లరికల్ తప్పిదాలను స్వీయ ప్రకటన ద్వారా సరిచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మిగిలిన అంశాల్లో ఎన్నికల సంఘం సూచించిన ధృవ పత్రాల్లో ఒకదాన్ని తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన ధృవ పత్రాలపై రాజకీయ పార్టీలు అవగాహన కల్పించి, విచారణకు హాజరయ్యే సమయానికి సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకునేలా సహకరించాలని కోరారు. రాజకీయ అనుబంధంతో సంబంధం లేకుండా ప్రతి అర్హత కలిగిన ఓటరుకు ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల సంఘం అందరితో సమన్వయంతో పనిచేస్తుందని తెలిపారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో మొత్తం 12 లక్షల 43 వేల 781 మంది ఓటర్లు ఉన్నారని,ఇప్పటి వరకు ఒక లక్ష 75 వేల 858 మంది ఓటర్లకు నోటీసులు జెనరేట్ కాగా, ఒక లక్ష 36 వేల 787 నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 17 వేల 555 విచారణలు నిర్వహించామని తెలిపారు.ఎన్నికల సంఘం అనుమతించిన ధృవ పత్రాలపై ప్రతి ఓటరుకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అవసరమైన ధృవ పత్రాలు లేని ఓటర్లకు సంబంధిత ధృవ పత్రాలు పొందేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారంలో వివరాలు ఉన్నప్పటికీ మ్యాపింగ్‌లో సమస్యలు ఉంటే విచారణ సమయంలో పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. పేర్లలో తప్పులు, ఇతర క్లరికల్ పొరపాట్లు, వివాహిత మహిళల విషయంలో పేర్ల మార్పులు వంటి అంశాలను బీఎల్ఓకు స్వీయ ప్రకటన సమర్పించడం ద్వారా సరిచేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎక్కడైనా ఉద్దేశపూర్వకంగా అవకతవకలకు పాల్పడినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీలు ఇప్పటివరకు సహకరిస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల కోసం ఎస్ఐఆర్‌పై మరోసారి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలని, అవసరమైన ధృవ పత్రాలు లేని వారికి సంబంధిత ధృవ పత్రాలు పొందేందుకు వీలైనంత సహకారం అందిస్తామని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం నుంచే జిల్లా కలెక్టర్ ప్రజలకు, రాజకీయ పార్టీలకు మంచి అవగాహన కల్పించారని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురైన సమస్యలను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు.ఓసీ వర్గానికి చెందిన కొంత మంది ఓటర్లు తమ ధృవ పత్రాలు సమర్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పెద్దగా సమస్యలు లేవని, పట్టణ ప్రాంతాల్లో మాత్రమే కొన్ని సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. జన్మతేదీ ఆధారంగా తల్లిదండ్రుల ధృవ పత్రాలు సమర్పించాలని కోరుతున్న సందర్భాల్లో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎలక్షన్ విభాగం పర్యవేక్షకులు రాజు, డీటీ అన్సారీ, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బెల్లం వేణుగోపాల్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, సీపీఐ(ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, టీడిపి పార్టీ ప్రతినిధి సిహెచ్. రాజరాజేశ్వరి, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బీఆర్ఎస్వి ప్రతినిధి ఎల్. సతీష్ బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అసెంబ్లీ స్పీకర్ ను తాత మధు అవమానించడం తగదు

**: కాంగ్రెస్ సీనియర్ నేత వడ్డేబోయిన నరసింహారావు**

**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** దళిత వర్గానికి చెందిన తెలంగాణ రాష్ట్ర స్పీకర్ మీద తాతా మధు తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయనను బర్తరఫ్ లేదా సస్పెన్షన్ చేయాలని చట్టసభలలో హుందాతనంగా ఉండవలసిన సభ్యులు దిగజారి ప్రవర్తిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ వడ్డేబోయిన నరసింహారావు తెలిపారు. ఆయన సోమవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. తాతా మధు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వ్రాయటానికి ,చెప్పటానికి వీలు లేని భాషను మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాల వారు అంటేనే రాజకీయాల్లో ఉండటానికి వీలు లేదనే విధంగా వ్యవహరిస్తున్నారని, రాజకీయాల్లో మేమే ఉండాలి, పదవులు మేమే అనుభవించాలి అనే భావనతో వుంటున్న ఇలాంటి వారిని శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పించి, ఇటువంటి వారి పట్ల కఠినంగా ఉండి, సమాజానికి మంచి సందేశం పంపించే విధంగా చట్ట సభలు తీర్మానం చేయాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం,నాయకులు కూడా ఈ విషయంలో స్పందించి తగు చర్య తీసుకొని ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ వర్గాల పట్ల గౌరవం కాపాడుకోవాలని లేని పక్షంలో వ్యతిరేక భావనను పెంచుకొన్న వారు అవుతారని తెలియచేశారు.



# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ముందడుగు..



**భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ఏర్పాటుకు కీలక ముందడుగు పడింది. ప్రతిపాదిత స్థలాల సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఏఏఐ మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం సోమవారం జిల్లాలో పర్యటించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది.ఏఏఐ సభ్యులు భరత్ రెడ్డి, ఎండీ ఏవియేషన్ నేతృత్వంలోని బృందం భూమి లభ్యత, రన్‌వే ఏర్పాటుకు అనుకూలత, విమానాల అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్, భద్రతా ప్రమాణాలను పరిశీలించింది. సీతంపేట, సుజాతానగర్, దుమ్ముగూడెం, చాపరాలపల్లి, పాల్వంచ/దమ్మపేట, పెనగడప ప్రాంతాల్లో ప్రతిపాదిత స్థలాలను బృందం పరిశీలిస్తోంది.సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఏఏఐ బృందం సమావేశమై విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై చర్చించింది. ఏ టి ఆర్ –72తో పాటు ఎయిర్‌బస్ ఏ 320/ఏ 321 విమానాల రాకపోకలకు అనుగుణంగా సుమారు 2,500–2,700 మీటర్ల రన్‌వే, భవిష్యత్ విస్తరణ, నైట్ ల్యాండింగ్ సదుపాయాలపై చర్చించారు.సమీపంలోని విద్యుదీకరించిన బొగ్గు రవాణా రైల్వే లైన్ అప్రోచ్ ఫన్నెల్‌కు అవరోధంగా మారే అవకాశాలపై కూడా సాంకేతిక బృందం ప్రత్యేకంగా అధ్యయనం చేస్తోంది. అవసరమైతే షీల్డింగ్, రైల్వే శాఖ నుంచి ఎన్ఓసీ పొందే అంశాలను పరిశీలించనున్నారు.జిల్లా యంత్రాంగం అవసరమైన రెవెన్యూ, సర్వే, సాంకేతిక రికార్డులను ఏఏఐ బృందానికి అందించింది. రెండు రోజుల పరిశీలన అనంతరం సాంకేతిక సాధ్యాసాధ్యాల నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. విమానాశ్రయం ఏర్పాటుతో పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు ఊతమిస్తుందని ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి తెలిపారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

## ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో లేకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.మధిర మండలం నిధానపురం గ్రామానికి చెందిన ఏ. నాగిరెడ్డి తమ పిల్లలకు షుగర్, కిడ్నీ వ్యాధి సమస్యలు ఉన్నాయని, దీనికి అవసరమైన మందులు సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం, కూసుమంచి మండలానికి చెందిన రైతులు తమకు ఆన్ లైన్ విధానం రద్దు చేసి ఎరువులు సరఫరా చేయాలని, భక్త రామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులు నింపాలని, మార్క్ ఫెడ్ ద్వారా పెసర పంట కొనుగోలు నిమిత్తం కోనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వ్యవసాయ శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

Neti Shubodyaa 08.09.2026_Layout 1 9/8/2026 7:12 AM Page 9



## మట్టి తరలింపు పై కలెక్టర్ సీరియస్

- క్షేత్ర స్థాయిలో మైనింగ్, రెవిన్యూ అధికారుల విచారణ
- మట్టి తీస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక




**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ప్రభుత్వ భుములలో అక్రమంగా మట్టి తరలింపు పై ఎట్టకేలకు అధికార యంత్రాంగం కదిలింది. మండలం లోని అప్పలనర సింహాపురం లో అక్రమంగా మట్టి తరలింపు పై జిల్లా కలెక్టర్ సీరియస్ అయ్యారని సమాచారం. స్పందించిన కలెక్టర్ విచారణ కు ఆదేశించారు. ఈ మేరకు మైనింగ్, ధైవిన్యూ అధికారులు సోమవారం అప్పల నరసింహాపురం లో మట్టి తీసిన గుట్టలను పరిశీలించారు. సర్వే నెంబర్ 342 లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఉన్న గుట్టలను ఎంత మేరకు తవ్వారు. ఎంత విస్తీరణం లో మట్టి ని తరలించారు. అనే విషయాల పై కొలతలు . తీసుకున్నారు. మట్టి ఎక్కడికి తరలించారు. అనే విషయాలను సానికులను అడిగి పంచనామా నిర్వహించారు. భారీ ఎత్తున మట్టి తరలింపు ను గుర్తించారు. ఈ మేరకు మైనింగ్ రాయల్టీ ఇన్స్పెక్టర్ నాగరాజు, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూధన్రావు లు గుట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అప్పలనరసింహాపురం ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి ని తరలించిన విషయం పై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. మట్టి తరలింపు ను గుర్తించినట్లు తెలిపారు. నివేదిక ను జిల్లా కలెక్టర్ కు అందించనున్నట్లు తెలిపారు. గుట్టపై మట్టి తవ్వ కాలకు యంత్రాలు వస్తే వాటిని సీజ్ చేయటంతో పాటు, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## డిండి ఆయకట్టు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- కేఎల్ఐ ద్వారా డిండి ప్రాజెక్టును వెంటనే నింపాలి
- మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్



**డిండి (గుండ్లపల్లి), నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** డిండి మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రామావత్ రవీంద్ర కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.నీళ్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. కేఎల్ఐ ద్వారా డిండి ప్రాజెక్టును వెంటనే నింపి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి రైతులకు నీరు అందించారని తెలిపారు. డిండి ప్రాజెక్టును నింపి రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ మహాధర్నాలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, నేనావత్ కిషన్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్లు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక భద్రతా పింఛన్ల ధ్రువీకరణ పూర్తి పారదర్శకం - పినపాక ఎంపీడీఓ సంకీర్త్



**పినపాక, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** సామాజిక భద్రతా పింఛన్ల ధృవీకరణ ప్రక్రియను త్వరలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించనున్నట్లు పినపాక మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంకీర్త్ తెలిపారు.పింఛను మంజూరు చేస్తామని, జాబితాలో పేరు ఉంచుతామని దళారులు లేదా మధ్యవర్తులు డబ్బులు డిమాండ్ చేస్తే నమ్మవద్దని ఆయన సూచించారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలాంటి రుసుము లేకుండా ధృవీకరణ ప్రక్రియ జరుగుతుందని స్పష్టం చేశారు.పింఛన్ల విచారణ పేరుతో ఎవరైనా లంచం అడిగినా లేదా ఇబ్బందులకు గురిచేసినా వెంటనే పినపాక ఎంపీడీఓ కార్యాలయంలో లేదా మండల ఫిర్యాదుల విభాగంలో నేరుగా ఫిర్యాదు చేయాలని కోరారు. అవినీతికి పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం – ప్రజల్లో అవగాహన కల్పించాలి.

### నేత్రదానం ద్వారా మరొకరికి చూపును ప్రసాదించవచ్చు: డీఎంహెచ్ఓ డా. తుకారామ్ రాథోడ్.



**భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** పోషకాహార వారోత్సవం సందర్భంగా ప్రజలకు సమతుల ఆహారం, పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. తుకారామ్ రాథోడ్ వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం రామవరం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడి సేవల వివరాలను తెలుసుకున్నారు.పోషకాహార వారోత్సవం సందర్భంగా ప్రతి కుటుంబానికి సమతుల ఆహారం ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పాలు తదితర పోషక పదార్థాలను తగిన మోతాదులో తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు, వృద్ధులు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.నేత్రదానంపై విస్తృత అవగాహననేత్రదాన అవగాహన పక్షోత్సవం (ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు)లో భాగంగా నిర్వహించిన రేడియో టాక్ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా. తుకారామ్ రాథోడ్ పాల్గొని నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించారు.మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా కార్నియా సమస్యలతో చూపును కోల్పోయిన ఇద్దరు వ్యక్తులకు చూపును ప్రసాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. నేత్రదానం గొప్ప సామాజిక సేవ అని, ఒక వ్యక్తి మరణించిన తర్వాత కూడా అతని కళ్ల ద్వారా మరొకరి జీవితంలో వెలుగును నింపవచ్చని వివరించారు.నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి వాస్తవాలను తెలియజేయాలని సూచించారు. కుటుంబ సభ్యులు తమ బంధువుల నేత్రదానానికి ముందుగానే సమ్మతి, అవగాహన కలిగి ఉండటం ముఖ్యమన్నారు. నేత్రదానంపై మరింత సమాచారం కోసం సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, నేత్ర వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు."మరణానంతరం మన కళ్లను దానం చేయడం ద్వారా మరొకరి జీవితంలో వెలుగును నింపవచ్చు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని, నేత్రదానానికి ముందుకు రావాలి" అని డీఎంహెచ్ఓ ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో వైద్య అధికారులు, వైద్య సిబ్బంది, సంబంధిత ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## తాతా మధు ఎమ్మెల్సీ పదవిని రద్దు చేయాలి : బోడ రమేష్



**పినపాక, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు సభాపతిని అవమానించేలా అనుచిత పదజాలం ఉపయోగించారనే ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు బోడ రమేష్ అన్నారు. పినపాక మండలం ఈ బయ్యారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. తాతా మధు వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి, సభా నియమాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయాన్ని అవమానించినట్లేనన్నారు. తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేసి, ప్రజాస్వామ్యానికి, సభా గౌరవానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు.తమ డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరవధిక దీక్షకు సిద్ధమవుతామని బోడ రమేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కొంబత్తిని శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్షుడు మునిగల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్-ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్

### -వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్ అధ్యక్షుడు రామకృష్ణ.



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ఖమ్మం పట్టణ కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసిన వాసవి యాజమాన్యం వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్ అధ్యక్షులు రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు.ఈ క్యాంప్‌లో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి,ఆరోగ్యంపై పలు సూచనలు అందించారు.కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అందరి సహకారంతో మెడికల్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించారు.ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని నిర్వాహకులుతెలిపారు.ఈకార్యక్రమంలో.వాసం క్లబ్ ,శివాలయం స్ట్రీట్ ప్రెసిడెంట్ మారేమల్ల రామకృష్ణ సెక్రెటరీ సుగ్గల శ్రీహరి ట్రెసరర్ కురువెళ్ళ గోపాలకృష్ణమూర్తి,నల్ల భాన,వల్లలా యుగేందర్ ఆధ్వర్యంలో వి ఎన్ డి మౌల్ కే సి జి ఎఫ్ శ్రేయోభిలాషి వాసవి ధాత కడవెండి శ్రీనివాస్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్.వి ఎన్ గోలెన్ కేసిజిఎఫ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గెల్ల కృష్ణవేణివిఎన్ గోల్డెన్ కెసిజిఎఫ్ వాసవి దత్త గుమ్మడవెల్లి శ్రీనివాస్ ని.వి ఎన్ సివర్ కెసిజిఎఫ్ గోళ్ళ రాధాకృష్ణమూర్తిని,వి ఎన్ సివర్ కేసిజిఎఫ్ మాశెట్టి వర ప్రసాద్ ని,వి ఎన్ సివర్ కేసిజిఎఫ్ కొదుమూరు జగన్నాథంని వి ఎన్ సివర్ కేసిజిఎఫ్ రాయల ఈశ్వరిని,ఆర్ సి దాస శ్రీనివాస్, ఆర్ఎస్ బోర్ల పుల్లారావు,ఎర్రం రామక్రిష్ణ,జెడ్ సిమోహన్ దాస్,మోహనరావు,విశ్వనాధం,బిక్షామయ్య, శ్రీనివాస్, రామక్రిష్ణ మహిళలు,క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యానికి తాతామధు వ్యాఖ్యలు పాతరవేసినట్టున్నాయి

### - కాంగ్రెస్ పార్టీ నాయకులు బొబ్బిళ్ళపాటి బాబురావు

**మధిర, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** మధిర పట్టణ కేంద్రంలోనిది అసెంబ్లీలో తాత మధు తన పార్టీ అయినా భారత రాష్ట్ర సమితి పెత్తందారి పోకడలను మరొక్కసారి బయటపెట్టారు. వారు అధికారంలో ఉన్నప్పుడు ఒక దళిత నాయకుడైన భట్టి విక్రమార్క శాసనసభలో కాంగ్రెస్ నాయకుడిగా తమను ప్రశ్నిస్తున్న విధానాన్ని జీర్ణించుకోలేక సంతలో పశువుల్ని ఉన్నట్టు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొని దళితుడైన భట్టికి సీఎల్పీ నాయకుడి ప్రతిపక్ష హోదాను లేకుండా చేశారు.ఇదేవిధంగా అదే రాచరికపు దొర తాబేదారులైన తాత మధు అసెంబ్లీ స్పీకర్ అయిన ఒక దళితుడి స్పీకర్ హోదాను అవమానించే విధంగా అసభ్యకరమైన పదజాలాన్ని ప్రజాస్వామ్య దేవాలయమైన అసెంబ్లీ ఆవరణలోని మాట్లాడటం టిఆర్ఎస్ బూర్జువ మనస్తత్వానికి పరాకాష్ట అని విమర్శించారు.కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మన రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్ష బి ఆర్ ఎస్ ఒకే తాను ముక్కలు. ఉత్తరాఖండ్లో కర్రే పాల్గొన్న సభా వేదికను శుద్ధిచేసిన వైనం మరువకముందే ఆ పార్టీని అంటకాగే టిఆర్ఎస్ నేత తాత మధు నేటి అసెంబ్లీ వ్యాఖ్యలు ఆ పార్టీల యొక్క పెత్తందారీ పోకడలను సూచిస్తున్నాయని విమర్శించారు.అసెంబ్లీలో తాత మధు వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని తక్షణమే ఆయన సభ్యత్వాన్ని తొలగించి ఆయనపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నాం - తోటమల్ల వరప్రసాద్

**భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07:** చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలిఈరోజు స్పీకర్ గడ్డం ప్రసాద్ గారు సభలో కన్నీరు కార్చడం నన్ను ఎంతగానో కలచివేసింది. అసెంబ్లీ ఎదుట రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను ఉద్దేశించి ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు వెలువడిన అనుచిత వ్యాఖ్యలను చర్ల మండల కాంగ్రెస్ పార్టీ ఎస్ సి సెల్ నాయకులు తోటమల్ల వరప్రసాద్ తీవ్రంగా ఖండించారు.రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ పట్ల గౌరవం, మర్యాద పాటించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. రాజకీయ అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ, రాజ్యాంగ సంస్థల గౌరవానికి భంగం కలిగించే విధంగా వ్యాఖ్యలు చేయడం సముచితం కాదన్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించే లేదా అధికారిక విధి నిర్వహణలో జోక్యం చేసుకునే ఏ చర్యనైనా సమర్థించలేమని పేర్కొన్నారు.ఈ ఘటనలకు సంబంధించిన పూర్తి వాస్తవాలను సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా పరిశీలించి, చట్టపరమైన అంశాలు ఉన్నట్లయితే వర్తించే చట్టాలు, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని తోటమల్ల వరప్రసాద్ డిమాండ్ చేశారు. అవసరమైన సందర్భంలో చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించి అరెస్టు వంటి చర్యలు తీసుకోవడం సంబంధిత దర్యాప్తు అధికారుల పరిధిలో ఉంటుందని తెలిపారు. రాజ్యాంగ సంస్థల గౌరవం, శాసనసభ ప్రతిష్ట, పోలీసు వ్యవస్థ విధి నిర్వహణకు భంగం కలగకుండా చూడటం ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరి బాధ్యత అని తోటమల్ల వరప్రసాద్ స్పష్టం చేశారు.రాజకీయ నాయ కులు తమ నిరసనలు, అభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యక్తం చేయాలని, చట్టపరమైన వ్యవస్థను మరియు



రాజ్యాంగ సంస్థలను గౌరవించాలని ఆయన కోరారు.

## రాజేంద్రనగర్ మన్నా చర్చి లో రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ జ్ఞాపకార్థ కూడిక



సమావేశంలో మాట్లాడుతున్న బిషప్ రేచల్ జ్యోతి కొమానపల్లి



బిషప్ బి ఎస్ మోజెస్ కుమార్

**బుద్వేల్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ ప్రేమ కలిగిన వ్యక్తి అని మన్నా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు బిషప్ రేచల్ జ్యోతి కొమానపల్లి అన్నారు. రాజేంద్రనగర్ మన్నా ఫుల్ గాస్పెల్ చర్చ్ పాస్టర్ గా సేవలందిస్తు.. ఇటీవల దేవునిలో నిద్రించిన రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ జ్ఞాపకార్థ కూడిక సోమవారం మన్నా చర్చిలో జరిగింది. రెవరెండ్ జాన్ మోజెస్ సతీమణి సిస్టర్ సీహెచ్ ప్రభావతి, కుమారులు జాన్ సామ్యూల్, జాన్ సుందర్ పాల్ ల ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రార్ధన సమావేశానికి మన్నా మినిస్ట్రీస్ తెలంగాణ రీజినల్ వైస్ ప్రెసెడింట్ రెవరెండ్ సీహెచ్ భాస్కర్ రావు అధ్యక్షత వహించారు. పూర్వం మంచిగా సేవ జరిగి 26 సంవత్సరాల క్రితం శిథిలమైన స్థితిలో ఉన్న చర్చి పరిస్థితులను బాగు చేయడానికి మన్నా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ ఎర్నెస్ట్ పాల్ కొమానపల్లి ద్వారా రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ ను రాజేంద్రనగర్ కు పంపించడం జరిగిందన్నారు. రాజేంద్రనగర్ లో రెవరెండ్ జాన్ మోజెస్ అద్భుతమైన సేవ జరిగించారని గుర్తు చేసుకున్నారు. నాయకత్వం అన్నా, దేవుని సేవ అన్నా ఆయనకు ఎనలేని ఇష్టం అని గుర్తు చేసుకున్నారు. నమ్మకమైన దేవుని సేవకుడని, ప్రేమించే మనస్సున్న వారని రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ గురించి గుర్తు చేసుకున్నారు. జ్ఞాపకార్థ కూడిక లో పాల్గొన్న రాక్ చర్చి సీనియర్ పాస్టర్ సిస్టర్ పి విజయ దీవెన్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ సతీమణి సిస్టర్ సీహెచ్ ప్రభావతి, కుమారులు జాన్ సామ్యూల్, జాన్ సుందర్ పాల్ లకు ఆదరణ కలిగించే మాటలు తెలియజేశారు. వారి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ లో దేవుని సేవ మరింత గొప్పగా జరుగుతుం దని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో పాల్గొన్న ఇంటర్నేషనల్ పెంతకోస్టల్ హోలినెస్ చర్చ్ ప్రిసైండింగ్ బిషప్ డాక్టర్ బి.ఎస్ మోజెస్ కుమార్ మాట్లాడుతూ, రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ దేవుని లో నిద్రించి పరలోక రాజ్యంలో ఆయన దేవుని సన్నిదిలో ఉన్నారన్నారు. ఆయనను జ్ఞాపకం చేసుకుంటు ఏర్పాటు చేసిన సమావేశంలో మనమందరం దేవుణ్ణి స్థుతించడానికి అవకాశం కలిగిందన్నారు. విడిచి వెళ్లిన కుటుంబానికి దేవుడే అండగా ఉంటారని ప్రార్ధన చేశారు. కుటుంబాన్ని ధైర్య పరుస్తు సిస్టర్ సీహెచ్ ప్రభావతి కి దేవుని ఆదరణ ఎలా ఉంటుందో తెలియజేసే తాను రాసిన పుస్తకాన్ని బహుమతిగా అందజేశారు. జ్ఞాపకార్థ కూడిక సందర్భంగా కుటుంబ సభ్యులు జాన్ సామ్యూల్, జాన్ సుందర్ పాల్, సిస్టర్ కృపాకుమారి, గ్లాడీ ప్రేంసన్, డానీ ప్రేంసన్ లతో పాటు చర్చి సభ్యులు రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ తో ఉన్న అనుబందాన్ని గుర్తు చేసుకున్నారు. సమావేశంలో మన్నా మినిస్ట్రీస్ రీజినల్ వైస్ప్రెసిడెంట్ రెవరెండ్ పీఎస్ డేవిడ్, నాయకులు రెవరెండ్ సంజీవ, రెవరెండ్ దేవానంద్, విజయనగరానికి చెందిన రెవరెండ్ డాక్టర్ ప్రేమానందం, రాజేంద్రనగర్ నియోజకవర్గం పాస్టర్స్ ఫెలోషిప్ అద్యక్షులు రెవరెండ్ డాక్టర్ కె నతానియేల్, రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, కోశాధికారి పాస్టర్ బట్టు శ్రీకాంత్ లతో పాటు మన్నా మినిస్ట్రీస్ కు చెందిన పాస్టర్లు, రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ కు చెందిన పాస్టర్లు, రాజేంద్రనగర్ పాస్ట రమ్మల ఫెలోషిప్ కు చెందిన పాస్టరమ్మ లు, మన్నా చర్చ్ విశ్వాసులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుటుంబ సభ్యులు



సమావేశంలో పాల్గొన్న కుటుంబ సభ్యులు, బంధువులతో బిషప్ రేచల్ జ్యోతి కొమానపల్లి

## పేదల పట్ట భూములను నిషేధిత జాబితాలో చేర్చవద్దు - రాజ్యసభ ఎం పి ఆర్ కృష్ణయ్య

**హైదరాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** రాష్ట్రంలో 22ఏ పేరుతో పేదలు, మధ్యతరగతి ప్రజలకు చెందిన పట్టా భూములను అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర అన్యాయం చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నగరాలు, పట్టణాల్లో మున్సిపల్ పర్మిషన్లు, హెచ్‌ఎండీఏ, హుడా అనుమతులు పొంది, ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని, క్రమం తప్పకుండా పన్నులు, విద్యుత్, నీటి బిల్లులు చెల్లిస్తున్న భూములను కూడా హఠాత్తుగా 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చడం అన్యాయమన్నారు. ప్రభుత్వం కావాలనే ఉద్దేశపూర్వకంగా భూ సమస్యలను సృష్టిస్తోందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి తన సొంత బలం లేదా కాంగ్రెస్ పార్టీ బలంతో మాత్రమే గెలవలేదని, యువత, నిరుద్యోగులు, విద్యార్థులు వీధుల్లో ప్రచారం చేసి కాంగ్రెస్‌కు అధికారం అందించారని అన్నారు. ఆ అధికారాన్ని సొంత బలంగా భావించి నిరంకుశ పాలన సాగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. శ్రీలంక, నేపాల్, అమెరికా వంటి దేశాల్లో యువత తిరగబడినట్లే తెలంగాణలోనూ పాలకులపై యువత తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ భూములు, ఎండోమెంట్స్, వక్ఫ్ భూములను మాత్రమే నిషేధిత జాబితాలో ఉంచాలని, అయితే పేదల పట్టా భూములను కావాలనే 22ఏలో చేర్చి, అనంతరం వారిని భయభ్రాంతులకు గురిచేసి తక్కువ ధరలకు భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు. అక్రమంగా సంపాదించాలనే ఉద్దేశంతో రెవెన్యూ, పోలీసు అధికారులను తమ చేతుల్లో పెట్టుకుని దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. రాజ్యాంగం ప్రకారం ఎంఆర్‌వోలు, కలెక్టర్లు, డీఎస్పీలు, సీఐల బదిలీలు, పోస్టింగులు చీఫ్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ వ్యవస్థ పరిధిలోని అంశాలని, కానీ ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు చెప్పిన వారికే పోస్టింగులు ఇస్తున్నారని ఆరోపించారు. దీంతో అధికారులు ప్రజలకు కాకుండా ఎమ్మెల్యేలకు గులాంగిరి చేసే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. అధికారులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. భూమి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చిన భూములను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే 22ఏ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షాలు పోరాడాలని, రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. 22ఏ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులంతా తమ సమస్యలను ప్రజా సంఘాల దృష్టికి తీసుకురావాలని, నాయకుల మెడలు వంచైనా బాధితులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. తెహల్కా మీడియా నెట్వర్క్ ఎడిటర్ కే. చంద్ర శేఖర్ ఆధ్వర్యములో జరిగిన ఈ సమావేశానికి సౌత్ ఇండియన్ జర్నలిస్ట్ ఫోరం ఫౌండర్ ప్రెసిడెంట్ సి. శ్యామ్ కుమార్ అధ్యక్షత వహించారు.తెలంగాణ విఠల్, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ,సోమ శేఖర్, నారగొని ప్రవీణ్,నాగరగోని ప్రవీణ్,రంగినేని శ్రీనివాసరావు,సురేష్ పొద్దార్,ముఖ్య అతిథి ఆర్, కృష్ణయ్య, ఎంపీబాలకృష్ణఏ1 టీవీ చైర్మన్,ఎర్రబెల్లి సతీష్,బి. నర్సింగరావు,కుమార్ యాదవ్,ఉగ్గే శ్రీను,ఎం. విజయ్ తదితరులు పాల్గొన్నారు.




## కార్మికులకు అండగా జేఏసీ



**శేరి లింగంపల్లి, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** అమీన్పూర్ భవనంలో పనిచేస్తున్న సమయంలో కార్మికుల కింద పడి చేయి విరిగింది. ఈ విషయం తెలుసుకున్న జె ఏ సి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు తన్నీరు శ్రీరామ్ వెళ్లి కార్మికుని యోగ క్షేమాలు తెలుసుకొని బిల్డర్ తో మాట్లాడి డబ్బులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీరామ్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏ కార్మికుడికి సమస్య వచ్చినా జేఏసీ అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జే ఏ సి అధ్యక్షులు తన్నీరు శ్రీరామ్, జనరల్ సెక్రెటరీ వెంకట శేషారావు, మియాపూర్ డివిజన్ సభ్యులు వెంకటేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం - డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి



**వికారాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని బీజేపీ వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం, ఉద్యోగుల డీఏలను పెండింగ్‌లో ఉంచడం ద్వారా అన్ని వర్గాలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు.ప్రజల భూములతో రియల్ ఎస్టేట్ వ్యవహారాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, భూభారతి పేరుతో వేల కోట్ల కమీషన్ల దందా జరుగుతోందని ఆయన ఆరోపించారు. శాసనసభ సాక్షిగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని మండిపడ్డారు. ఇలాంటి బెదిరింపులకు బీజేపీ భయపడదని, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని రాజశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు.

## తోగూడెంలో రెండు చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు



**పినపాక, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** పినపాక మండలం తోగూడెం గ్రామంలో రెండు చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు స్థానిక సర్పంచ్ పూణెం వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ యువజన సంఘం కార్యదర్శి కాలసాని సంజయ్ రెడ్డి గ్రామపంచాయతీకి సీసీ కెమెరాలను అందించినట్లు తెలిపారు . వీటి విలువ సుమారు రూ.20,000 ఉంటుందని తెలిపారు. గ్రామంలో భద్రతను మెరుగుపరిచేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని సర్పంచ్ అన్నారు. గ్రామంలో అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడంతో పాటు ప్రజలకు భద్రతా భావన కల్పించేందుకు కెమెరాలు దోహదపడతాయన్నారు .ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అచ్చా నవీన్, స్థానిక కాంగ్రెస్ నాయకులు సతీష్ చారి, తదితరులు పాల్గొన్నారు.

Neti Shubodyaa 08.09.2026_Layout 1 9/8/2026 7:12 AM Page 11



## విదేశీ విద్యకు బీసీ, ఈబీసీ విద్యార్థులకు విద్యానిధి అవకాశం - వై .మాధవరెడ్డి



**వికారాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** మహాత్మా జ్యోతిబా పులే విదేశీ విద్యానిధి పథకం కింద 2026 ఆగస్టు–సెప్టెంబర్ విడతకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వై. మాధవ రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న బీసీ, ఈబీసీ విద్యార్థులు తెలంగాణ ఈ–పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.విదేశాల్లో మాస్టర్స్ లేదా డాక్టరేట్ విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండడంతో పాటు దరఖాస్తుదారుడి వయస్సు 35 సంవత్సరాలలోపు ఉండాలి. డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. జీఆర్ఈలో 260 లేదా జీమ్యాట్‌లో 500 మార్కులు, అలాగే టోఫెల్‌లో 60, ఐఈఎల్టీఎస్‌లో 6 లేదా పీటీఈలో 50 మార్కులు సాధించిన వారు అర్హులని వివరించారు.దరఖాస్తుతో పాటు కులం, స్థానికత, ఆదాయ, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, ఈ–పాస్ గుర్తింపు సంఖ్య, పాస్‌పోర్టు, పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ వరకు విద్యార్హతల ధ్రువపత్రాలు, జాతీయ బ్యాంకు పాస్‌పుస్తకం తదితర పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఒక కుటుంబం నుంచి ఒక విద్యార్థికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు.బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వారు ఎంచుకున్న విశ్వవిద్యాలయం నిర్ణయించిన ఫీజును బట్టి రెండు విడతల్లో ఉపకార వేతనం మంజూరు చేస్తామని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం తెలంగాణ ఈ–పాస్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## 10న చలో హైదరాబాద్

**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** సెప్టెంబర్ 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్ ఉద్యోగుల సంఘం (టిఎస్ జిఆర్ఈఏ) పిలుపునిచ్చింది. జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపులో భాగంగా జరిగే ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా నుంచి వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులు తరలిరావాలని కోరింది. ఖమ్మం పెన్షనర్స్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు మాట్లాడారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పెన్షనర్లు, ఉద్యోగుల పట్ల ఒకే విధమైన వైఖరిని అవలంబిస్తున్నాయని విమర్శించారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తూ ప్రభుత్వం మాటలతో కాలయాపన చేయడం సరికాదన్నారు.రిటైర్డ్ ఉద్యోగుల హెల్త్ కార్డులను అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో అమలు చేయాలని, పిఆర్ సీ కమిటీ నివేదికను ప్రకటించి వెంటనే అమలు చేయాలని, మార్చి 2024 తర్వాత పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వం తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు.ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లతో కలిసి ఖమ్మం జిల్లా నుంచి వేలాదిగా తరలివెళ్లి చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. అనంతరం చలో హైదరాబాద్ గోడపత్రికను ఆవిష్కరించారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్. పూర్ణచంద్రరావు, ఆర్. దుర్గాదేవి, ఉపేందర్‌రావు, జానయ్య, కృష్ణారెడ్డి, ఖాజా మొయినుద్దీన్, సి. బాబురావు, నగర శాఖ నాయకులు రాధాకృష్ణ, రమేష్, వెంకటేశ్వర్లు, చావగాని బాబు, రమణ, యాదవ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు

## టీబీ పేషెంట్లకు ఆరు నెలలకు సరిపడా పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలి - అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** జిల్లాలోని ప్రతి టీబీ పేషెంట్‌కు ఆరు నెలలకు క్రమం తప్పకుండా పోషకాహారం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిక్షయ్ కార్యక్రమం క్రింద టీబీ పేషెంట్లకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో సుమారు 3,000 మంది టీబీ పేషెంట్లు ఉన్నారని, ప్రతి పేషెంట్‌కు ఆరు నెలలకు సరిపడా పోషకాహారం అందేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో పాటు సత్యసాయి సొసైటీ, ఇతర స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రతి టీబీ పేషెంట్‌కు న్యూట్రిషన్ కిట్లు అందేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. ఎక్కువ మంది దాతలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గతంలో సుమారు 12 వేల న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశామని, ప్రస్తుతం కిట్ల పంపిణీ సంఖ్య తగ్గిందని తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, సత్యసాయి సొసైటీలు ఈ అంశంపై సమీక్ష నిర్వహించి, జిల్లాలోని ప్రతి టీబీ పేషెంట్‌కు నిరంతరం పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు మాట్లాడుతూ క్షయ వ్యాధి నుంచి త్వరగా కోలుకోవడానికి మందులతో పాటు మంచి పోషకాహారం తీసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. నిక్షయ్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో టీబీ పేషెంట్లకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. న్యూట్రిషన్ కిట్లలో పల్లీలు, 1.5 కిలోల పప్పు, 1 కిలో బియ్యం, పావు కిలో వంట నూనె ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, అధికారులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కోరిక మేరకు సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు విడుదల : మంత్రి తుమ్మల

- పంటలు ఎండిపోకుండా రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు
- ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో చర్చించి నీరు విడుదలయ్యేలా కృషి చేసిన మంత్రి తుమ్మల



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** సాగర్ ఆయకట్టు పరిధిలో సాగు చేస్తున్న రైతుల పంటలకు నీటి కొరత ఏర్పడకుండా, పంటలు ఎండిపోయి రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతుల విజ్ఞప్తి మేరకు వైరా, లంకసాగర్ రిజర్వాయర్ల పరిధిలోని సాగర్ ఆయకట్టు కింద సాగవుతున్న పంటలకు నీటిని అందించేందుకు గోదావరి జలాలను విడుదల చేయించినట్లు మంత్రి వెల్లడించారు.

**--- రైతుల సమస్యను గుర్తించిన మంత్రి**

తల్లాడ మండలంలో మంత్రి తుమ్మల పర్యటించిన సందర్భంగా సాగర్ ఆయకట్టు పరిధిలోని పలువురు రైతులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సాగు చేసిన పంటలకు ప్రస్తుతం నీరు అత్యవసరంగా ఉందని, సకాలంలో నీరు అందకపోతే పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులు మంత్రికి వివరించారు. పంటలు చేతికొచ్చే సమయంలో నీటి కొరత ఏర్పడితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యను ప్రత్యక్షంగా తెలుసుకున్న మంత్రి, పరిస్థితిని తీవ్రతను గుర్తించి వెంటనే స్పందించారు.

**--- నిన్ననే కలెక్టర్, ఇరిగేషన్ అధికారులతో మంత్రి చర్చలు**

రైతులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యపై మంత్రి తుమ్మల నిన్ననే జిల్లా కలెక్టర్‌తో పాటు ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడారు. సాగర్ ఆయకట్టు పరిధిలో పంటల పరిస్థితిని పరిశీలించి, నీటి అవసరాలను అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. పంటలు ఎండిపోయి రైతులు నష్టపోకుండా అవసరమైన నీటిని అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, సంబంధిత అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**--- ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో అసెంబ్లీలో భేటీ**

రైతుల సమస్యను అంతటితో వదిలిపెట్టకుండా, నేడు అసెంబ్లీలో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా బేటీ అయ్యి చర్చించారు. ఈ సందర్భంగా సాగర్ ఆయకట్టు పరిధిలో నెలకొన్న పరిస్థితులను ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వైరా, లంకసాగర్ రిజర్వాయర్ల పరిధిలో సాగర్ ఆయకట్టు కింద సాగవుతున్న పంటలకు నీరు అందించాల్సిన అత్యవసర పరిస్థితిని వివరించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గోదావరి జలాలను ఆయకట్టుకు తక్షణమే నీటిని విడుదల చేయాలని కోరారు.

**--- మోటార్లు ఆన్ చేసి గోదావరి జలాల విడుదల**

మంత్రి తుమ్మల విజ్ఞప్తికి స్పందించిన ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. దీంతో సాగర్ ఆయకట్టు పరిధిలోని పంటలకు నీటిని అందించేందుకు ఈ రోజు మోటార్లను ఆన్ చేసి గోదావరి జలాలను విడుదల చేశారు. దీంతో సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఉపశమనం లభించింది. పంటలు ఎండిపోకుండా, సాగు చేసిన పంటలకు అవసరమైన నీరు అందేలా చర్యలు కొనసాగుతున్నాయి.

**--- రైతుల పంటలను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యం**

రైతుల పంటలను కాపాడటం, సాగుకు అవసరమైన నీటిని అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సాగర్ ఆయకట్టు పరిధిలో పంటలకు నీటి కొరత ఏర్పడకుండా ఇరిగేషన్ అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. నీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని ఆదేశించారు.

**--- నీటిని పొదుపుగా, జాగ్రత్తగా వినియోగించాలి**

ప్రస్తుతం ఉన్న ఎల్.ని.నో. పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని రైతులు పొదుపుగా, జాగ్రత్తగా వినియోగించుకోవాలని రైతులకు మంత్రి తుమ్మల సూచించారు. కాలువల ద్వారా వచ్చే నీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకు మాత్రమే వినియోగించుకోవాలని, నీరు ప్రతి ఎకరాకు అందేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఎక్కువ విస్తీర్ణంలో పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు.

**--- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తుమ్మల భరోసా ఇచ్చారు. పంటలు ఎండిపోకుండా అవసరమైన మేరకు నీటి సరఫరా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని తక్షణమే స్పందించి గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు విడుదల చేయించడం ద్వారా పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడదని స్పష్టం చేశారు.

**--- ప్రభుత్వ స్పందనపై రైతుల హర్షం**

పంటలు ఎండిపోయే పరిస్థితిని గుర్తించి, రైతుల విజ్ఞప్తి మేరకు వెంటనే స్పందించి గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు విడుదల చేయించడంపై ఆయకట్టు పరిధిలోని రైతులు హర్షం వ్యక్తం చేశారు. నీటి కొరత సమయంలో ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టడం పట్ల రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## పండగలు, జాతరల్లో పోలీసుల వ్యవహారశైలిపై శిక్షణ






**మధిర, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** మధిర పట్టణ కేంద్రంలోనిది అసెంబ్లీలో తాత మధు తన పార్టీ అయినా భారత రాష్ట్ర సమితి పెత్తందారి పోకడలను మరొక్కసారి బయటపెట్టారు. వారు అధికారంలో ఉన్నప్పుడు ఒక దళిత నాయకుడైన భట్టి విక్రమార్క శాసనసభలో కాంగ్రెస్ నాయకుడిగా తమను ప్రశ్నిస్తున్న విధానాన్ని జీర్ణించుకోలేక సంతలో పశువుల్ని ఉన్నట్టు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొని దళితుడైన భట్టికి సీఎల్పీ నాయకుడి ప్రతిపక్ష హోదాను లేకుండా చేశారు.ఇదేవిధంగా అదే రాచరికపు దొర తాబేదారులైన తాత మధు అసెంబ్లీ స్పీకర్ అయిన ఒక దళితుడి స్పీకర్ హోదాను అవమానించే విధంగా అసభ్యకరమైన పదజాలాన్ని ప్రజాస్వామ్య దేవాలయమైన అసెంబ్లీ ఆవరణలోని మాట్లాడటం టిఆర్ఎస్ బూర్జువ మనస్తత్వానికి పరాకాష్ట అని విమర్శించారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మన రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్ష బి ఆర్ ఎస్ ఒకే తాను ముక్కలు. ఉత్తరాఖండ్లో కర్గే పాల్గొన్న సభా వేదికను శుద్ధిచేసిన వైనం మరువకముందే ఆ పార్టీని అంటకాగే టిఆర్ఎస్ నేత తాత మధు నేటి అసెంబ్లీ వ్యాఖ్యలు ఆ పార్టీల యొక్క పెత్తందారీ పోకడలను సూచిస్తున్నాయని విమర్శించారు. అసెంబ్లీలో తాత మధు వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని తక్షణమే ఆయన సభ్యత్వాన్ని తొలగించి ఆయనపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను అక్రమ అరెస్టులకు నిరసనగా రాస్తారోకో



**పినపాక, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** అసెంబ్లీ సమావేశాలకు వెళుతున్న బి ఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సోమవారం అక్రమంగా పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మండల బిఆర్ఎస్ నాయకులు ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి మాట్లాడారు. ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ ను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడం సిగ్గుచేటని ఆరోపించారు. బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలను పోలీసులు లాగి పడేయడం అమానుష చర్య అని అరపించారు. రేవంత్ సర్కార్ దుర్మార్గపు పరిపాలన కొనసాగిస్తుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Neti Shubodyaa 08.09.2026_Layout 1 9/8/2026 7:12 AM Page 12



# కాంగ్రెస్ హామీలను వెంటనే అమలు చేయాలి

## - ప్రజావాణిలో బీఆర్ఎస్ నాయకులు డిమాండ్

పినపాక, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలను, 420 హామీలను ప్రజలకు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలన్నిటిని తుంగలో తొక్కి ప్రజలను అన్ని విధాల మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిని కత్తిరిస్తూ ప్రజా నయవంచనకు పాల్పడుతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన వెయ్యి రోజుల పాలన రాక్షస పాలనగా మారిందని అభివర్ణించారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి, నాయకులు వాసు బాబు, సత్తిబాబు, పటేల్ భద్రయ్య, కొండేరు రాము, నాగభూషణం, ముక్కు వెంకటేశ్వర రెడ్డి, బెడద సురేందర్,



బుల్లిబాబు, కాయం శేఖర్, నరసింహారావు చింతపండు సత్యం, బి రమేష పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో శివ స్వాముల గురుస్వామి

- లొంగరి యాదగిరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం
- 27వ సోమవారం అన్నదాన ప్రభువు సిద్దగోని రమేష్ గౌడ్

మంచాల, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 : మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీ శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో ప్రతి సోమ వారం గౌడ సంఘం పెద్దలు దాతల సహకారంతో శివస్వాముల గురుస్వామి లొంగరి యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం27వ సోమవారం అన్నదాన ప్రభువు సిద్దగోని రమేష్ గౌడ్ ముందుగా కూతురు సుప్రజాలక్ష్మి జన్మదినం సందర్భంగా ముందుగా కంఠమహేశ్వర దేవాలయంలో కంఠమహేశ్వరస్వామికి శివలింగానికి రమేష్ గౌడ్ దంపతులు కుటుంబసభ్యు లు గౌడ సంఘం అధ్యక్షుడు తంగడపల్లి నరేందర్ గౌడ్ ఉపాధ్యక్షుడు సుంకరి ప్రవీణ్ గౌడ్ మాడుగుల కృష్ణగౌడ్ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు చెరుకు నరసింహగౌడ్ అంతటి రాజుగౌడ్ వైయ స్సార్ మాధగోని జంగయ్యగౌడ్ తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం భక్తులకు అన్న దాన కార్యక్రమం ప్రారంభించారు ఈకార్యక్రమంలో ప్రజాసంఘాల



నాయకుడు కంబాలపల్లి భా స్కర్ డాక్టర్ నేరెళ్ల శంకర్ అయ్యప్ప స్వాముల గురుస్వామి లొంగరి దాసు సుంకరి జంగయ్య గౌడ్ పల్లె శ్రీనివాస్ గౌడ్ పాశం బాలరాజు గౌడ్ కాసుల జంగయ్య కొత్తపల్లి నరసింహగౌడ్ మంద పాకుల శ్రీనివాస్ తవిటి నరసింహ ముదిరాజ్తదితరులుపాల్గొన్నారు.

# కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11న జరిగే ఛలో హైదరాబాద్ జయప్రదం చేయండి

నిజామాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 : తెలంగాణ రాష్ట్రంలోని కేజీబీవీలో పనిచేస్తున్న నాన్ టీచింగ్,వర్కర్ల వేతనాల పెంపు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 11న ఛలో హైదరాబాద్ ప్రచార కరపత్రాలను నిజామాబాద్ సౌత్,నార్త్ కేజీబీవీల్లో ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా యూనియన్ రాష్ట ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ....కేజీబీవీ నాన్ టీచింగ్,వర్కర్లకు ఏళ్లుగా వేతనాలు పెరగలేదని,పైగా పని భారం పెరిగిందన్నారు.సమస్యలు పరిష్కరించమని విన్నవిస్తే,అదనంగా నైట్ డ్యూటీలు వేశారని ఆరోపించారు.కేజీబీవీ ల పట్ల గత ప్రభుత్వం కంటే కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.మూడేళ్లుగా అధికారులను ప్రభుత్వాన్ని ప్రజాప్రతినిధులను కలిసి విన్నవిస్తూనే ఉన్నామని,ఇక పోరాటం తప్ప మరోమార్గం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలన్నారు.అకౌంటెంట్, వర్కర్లకు నిబంధనలకు,జాబ్ చార్ట్ కు భిన్నంగా ఇటీవల కేటాయించిన నైట్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు.వారానికి ఒకరోజు సెలవు చొప్పున వర్కర్లకు వీక్లీఆఫ్ అమలు చేయాలన్నారు.ఖాళీ పోస్టులు భర్తీచేసి పనిభారం తగ్గించాలన్నారు.ప్రభుత్వ ఉద్యోగాల్లో అర్హతలు



ఉన్న నాన్ టీచింగ్ సిబ్బందికి వెయిటేజీ ఇవ్వాలన్నారు.రిటైర్మెంట్ వయసును 65 సంవత్సరాలకు పెంచాలని,రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు.పీఎఫ్ ఈఎస్ఐ అమలు చేసి ఉద్యోగ,ఆరోగ్యభద్రత కల్పించాలన్నారు.ఈనెల 11న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేజీబీవీల నాన్ టీచింగ్,వర్కర్లు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది అఖిల,నగ్మా,రజిని,బాలమణి,మంజుల తదితరులు పాల్గొన్నారు.

# దళిత బిడ్డపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బి.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ వెంటనే రాజీనామా చేయాలి

### స్పీకర్ గడ్డం ప్రసాద్ పై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన : ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్

ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 : తెలంగాణ శాసనసభ స్పీకర్, దళిత బిడ్డ గడ్డం ప్రసాద్ కుమార్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ అన్నారు.రాజ్యాంగ బద్ధమైన అత్యున్నత పదవుల్లో ఒకటైన శాసనసభ స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని ఆయన అన్నారు. ఒక దళిత బిడ్డ శాసనసభ స్పీకర్గా ఎదగడం వెనుక రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు ఉన్నాయని పేర్కొన్నారు."దళితుల పట్ల అవమానకరంగా, అనుచితంగా మాట్లాడే హక్కు ఏ రాజ్యాంగం ఇచ్చింది? ప్రజా జీవితంలో ఉన్న నాయకులు ఇలాంటి భాషను ఉపయోగించడం సమాజానికి ఏ సందేశం ఇస్తుంది?" అని ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ ప్రశ్నించారు.అంతే కాకుండా, "తాతా మధుసూదన్ మీరు ఎమ్మెల్సీగా ఎన్నికై ఈ స్థాయికి రావడానికి కూడా ఇదే ప్రజాస్వామ్య వ్యవస్థ, ఇదే రాజ్యాంగం కారణం. దళితులు సహా అణగారిన వర్గాల హక్కులను, ఆత్మగౌరవాన్ని కాపాడే రాజ్యాంగ విలువలను గుర్తుంచుకోవాలి" అని హితవు పలికారు. దళిత సమాజాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ఏ విధంగానూ సమర్థనీయం కాదని, ఇలాంటి వ్యాఖ్యలను ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలని అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్కు బహిరంగంగా క్షమాపణ చెప్పడంతో పాటు, తన ఎమ్మెల్సీ పదవికి తాతా మధుసూదన్ తక్షణమే రాజీనామా చేయాలని పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఇకపై



సహించేది లేదని, సామాజిక సమానత్వం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్ లో ఓటర్లకు నోటీసులు ఇచ్చి పకడ్బందీగా విచారణ




హన్మకొండ, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 : ఎస్ఐఆర్లో అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, నిబం ధనల ప్రకారం పారదర్శకం గా విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారుల ను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టర్లతో సమీక్షించారు. అర్హులైన ఓటర్ల హక్కుల ను పరిరక్షిస్తూ, నిర్ణీత గడువులోగా నోటీసుల జారీ, విచారణ పూర్తి చేయాలని సూచించారు.కలెక్టరేట్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి మాట్లాడుతూ జిల్లాలో నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలోని ఓటర్లకు సుమారు 75 శాతం నోటీసుల జారీ పూర్తయిందని, విచార ణలు సజావుగా కొన సాగుతున్నాయని తెలిపారు. విచారణకు హాజరుకాని వారికి రెండో సారి నోటీసులు జారీ చేయనున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఆర్డీవో వెంకటేష్, ఏఈఆర్ ఓ రవీందర్రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



హనుమకొండ, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పై తీసుకున్న చర్యలను సంబంధిత ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 269 దరఖాస్తులు అందాయి. ఇందులో జిల్లా స్థాయిలో 123, డివిజన్ స్థాయిలో 23, మండల స్థాయిలో 123 దరఖాస్తు లు ఉన్నాయి. అధికారులు శేషాద్రి, శ్రీనివాస్, మేన శ్రీను, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



హనుమకొండ, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామపంచా యతీ, అంగన్వాడీ కేంద్రా లు, మహిళా సంఘాల భవనాల నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లుల ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, సకాలంలో చెల్లింపు లు జరిగేలా చర్యలు తీసు కోవాలని సూచించారు.ఇంకా అభివృద్ధి అవసర మైన గ్రామాలను గుర్తించి కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పనులను శాఖల సమన్వయంతో ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశం లో డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

Neti Shubodyaa 08.09.2026_Layout 1 9/8/2026 7:12 AM Page 13



## తునికి ఖల్సా గ్రామంలో ఫెరోమోన్ ట్రాప్‌ల ఏర్పాటు పై రైతులకు అవగాహన



**వర్గల్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** సిద్దిపేట జిల్లా: వర్గల్ మండలం తునికి ఖల్సా గ్రామ పంచాయతీ పరిధిలో రైతులకు పంటల్లో పురుగుల నివారణపై అవగాహన కల్పించేందుకు ఫెరోమోన్ ట్రాప్‌ల ఏర్పాటు మరియు వినియోగంపై ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ శ్రీ కె. గణేష్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మరియు గ్రామ రైతుల సమక్షంలో నిర్వహించబడింది. కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్, రాజేంద్రనగర్‌కు చెందిన RAWEP విద్యార్థులు రైతులకు ఫెరోమోన్ ట్రాప్‌ల ఉపయోగం, ఏర్పాటు విధానం మరియు నిర్వహణపై ప్రాయోగికంగా వివరించారు. ఈ కార్యక్రమాన్ని RAWEP విద్యార్థులు అనూష, లావణ్య, భార్గవి, ప్రవీణ, వెంకట హర్షిణి మరియు హర్షద ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు రైతులకు ఫెరోమోన్ ట్రాప్‌లను పొలంలో సరైన ప్రదేశంలో మరియు తగిన ఎత్తులో ఏర్పాటు చేసే విధానాన్ని ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. ఫెరోమోన్ ట్రాప్‌లు పంటల్లో హానికర పురుగుల ఉనికిని ముందుగానే గుర్తించడానికి, వాటి సంఖ్యను పర్యవేక్షించడానికి మరియు సమగ్ర పురుగు యాజమాన్యం (IPM) లో భాగంగా ఉపయోగపడతాయని విద్యార్థులు వివరించారు. ట్రాప్‌లోని ల్యూర్‌ను సక్రమంగా అమర్చడం, ట్రాప్‌ను క్రమం తప్పకుండా పరిశీలించడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీ కె. గణేష్ మాట్లాడుతూ, రైతులు పర్యావరణహితమైన పురుగు నియంత్రణ పద్ధతులను అవలంబించి, పురుగు మందులను అవసరమైనప్పుడు మాత్రమే వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, RAWEP విద్యార్థులు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు. ఫెరోమోన్ ట్రాప్‌ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించడంలో ఈ కార్యక్రమం ఉపయోగకరంగా నిలిచింది.

## గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ నేత పాలెపు వెంకటరమణ



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగేందర్ సహకారంతో 44 వ డివిజన్ స్థిర నివాసి అయినా శేఖర్ దంపతులు ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ వేడుక సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 44 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ. ఈ సందర్భంగా నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ గృహప్రవేశ కార్యక్రమంలో 44 వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాచిరెడ్డిపల్లి సదాశివపేట మండలంలో రైతుల సమావేశం



**సంగారెడ్డి, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** మాచిరెడ్డిపల్లి సదాశివపేట మండలంలో రైతుల సమావేశం నిర్వహించబడినది. ఈ సమావేశంలో వరిలో సన్న రకాలు వేసిన రైతులు పంట వివరాలు నమోదు చేసుకోగలరని కోరుచున్నాము .రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల అనుసారం ప్రభుత్వం ప్రకటించిన వరిలో సన్న రకాలు సాగు చేసిన రైతులకు అదనంగా 500 రూపాయలు బోనస్ ప్రకటించడం జరిగినది ప్రభుత్వం ప్రకటించిన వరిలో ఏడు సన్న రకాలు ఏవనగా 1)బిపిటి 5204 2) HMT సోనా 3) RNR 15048 తెలంగాణ సోనా 4) కే ఎన్ ఎం 1638 5) జైశ్రీరామ్ 6)wgl 44 సిద్ది 7) కెఎన్ఎమ్ 7715 కావున రైతులందరికీ తెలియజేయునది ఏమనగా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న వరిలో సన్న రకాలు ఎవరైతే సాగు చేశారో ఆ రైతులందరూ సంబంధిత డీలర్ దగ్గర గాని ఏఈఓ దగ్గర గానీ పేర్లు నమోదు చేసుకొని ప్రభుత్వము ప్రకటించిన 500 రూపాయలు బోనస్ లబ్ది పొందగలరని కోరుచున్నాము.చివరి తేదీ ఈ నెల 10వ తేదీ వరకు నమోదు చేసుకోగలరు ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ మండల వ్యవసాయ అధికారి రమేష్ గారు ఏ ఈ ఓ ప్రభు చరణ్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు

## రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలు అవార్డు గ్రహీతకు సన్మానం



**నిజామాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలిగా ప్రభుత్వం నుండి అవార్డు స్వీకరిచిన తెలుగు అధ్యయన శాఖ ఆచార్యులు కరీమిండ్ల లావణ్యను సోమవారం తెలంగాణ విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాంబాబు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాంబాబు మాట్లాడుతూ....రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకురాలిగా ప్రొఫెసర్ కరీమిండ్ల లావణ్య ఎంపిక కావడం తెలంగాణ విశ్వ విద్యాలయానికి,తెలుగు అధ్యయన విభాగానికి గర్వకారణమని పేర్కొన్నారు.ఆమె బోధనా సేవలు,విద్యార్థుల పట్ల అంకితభావం,తెలుగు భాషా సాహిత్య రంగానికి అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.సన్మాన గ్రహీత ఆచార్య కె.లావణ్య మాట్లాడుతూ....రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలి పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని,భవిష్యత్తులోనూ విద్యార్థుల అభ్యున్నతి,తెలుగు భాషా సాహిత్య వికాసానికి మరింత కృషి చేస్తానని ఆమె తెలిపారు.ఈ సందర్భంగా ఆచార్య లావణ్యను వర్సిటీ ఉపకులపతి ఆచార్య టి.యాదగిరిరావు,రిజిస్ట్రార్ ఆచార్య యం.యాదగిరి లు అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి.చంద్రశేఖర్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.సంపత్ కుమార్,యూనివర్సిటీ ఈసీ నెంబర్ ఆచార్య ఆంజనేయులు,వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు

## ఇశ్రీతాబాద్ గ్రామంలో ఇందిరమ్మ గృహం ప్రారంభించిన TGIIC ఛైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి

**సంగారెడ్డి, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** గ్రామ సర్పంచ్ బలరాంఅనితశ్రీనివాస్. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి సమర్తవంతంగా అమలు చేసి పెద ప్రజలకి ఆదుకుంటుందని. చెప్పటం జరిగింది. రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం మా నాయకుడు తూర్పు జయప్రకాశరెడ్డి గారి సహకారంతో టీజీఏసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి గారి సహకారంతో. ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేసినందుకు ధన్యవదములు తెలియచేసి లబ్దిదారిలు ఇట్టి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్ గారు సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు మల్లికార్జును పటేల్. ఎల్లారం సర్పంచ్ మల్లేశం. మంచిరెడ్డపల్లి సర్పంచ్




మోహనగౌడ్.. ఇశ్రీతాబాద్ గ్రామ ఉప సర్పంచ్ కట్టేకోశే శ్రీనివాస్. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్టకోశే నవీన్. గ్రామ వార్డ్ సభ్యులు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ఆత్మకూరు బస్వారాజు.ఇశ్రీతాబాద్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## అసెంబ్లీకి రాకుండా అరెస్టులు చేయించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

- **ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులా?**
  **- లింగాల కమల్‌రాజు**
- **హామీలు విస్మరించిన ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం**



**బోనకల్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళ్తున్న భారత రాష్ట్ర సమితి శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులను అసెంబ్లీకి రాకుండా అక్రమంగా అరెస్టు చేయించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టువంటిదని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, భారత రాష్ట్ర సమితీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు తీవ్రంగా మండిపడ్డారు. ఈ చర్యలను నిరసిస్తూ సోమవారం బోనకల్ మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులకు అసెంబ్లీలో ప్రజల గొంతుకగా నిలిచే హక్కు ఉందని, ఆ హక్కును కాలరాయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణచివేయవచ్చని ప్రభుత్వం భావిస్తే అది వారి భ్రమ మాత్రమేనని, ప్రజల తరఫున తమ పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా విస్మరిస్తోందని కమల్‌రాజు ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? రైతు భరోసా పరిస్థితి ఏమిటి? యువతకు ప్రకటించిన ఉద్యోగాల మాట ఏమైంది? మహిళలకు ఇచ్చిన హామీలు ఎక్కడ అమలవుతున్నాయి? పేదలకు ఇళ్ల హామీ ఏమైంది? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ, తమ వైఫల్యాలను ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై అరెస్టులు, నిర్బంధాలు ప్రయోగించడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చాలని చూస్తున్నారని విమర్శించారు. హామీలు అమలు చేయాలని అడిగితే అరెస్టులు చేస్తారా? ప్రజల సమస్యలను సభలో ప్రస్తావిస్తే గొంతు నొక్కుతారా? అని నిలదీశారు.అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత అని, హామీల నుంచి తప్పించుకోవడానికి ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పక తప్పదని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ప్రశ్నించడం సహజమని, ప్రశ్నించే హక్కును హరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలపై ఎన్ని అక్రమ కేసులు, అరెస్టులు చేసినా ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఆపేది లేదని లింగాల కమల్‌రాజు తేల్చి చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడు, బోనకల్ ఉపసర్పంచ్ బానోత్ కొండ, సర్పంచ్ బానోత్ జ్యోతి, మండల కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పారప్రసాద్, మాజీ రైతుబంధు మండల కన్వీనర్ వేమూరి ప్రసాద్, గుండపనేని సుధాకర్‌రావు, బంధం నాగేశ్వరరావు, ఎస్సీ విభాగం నాయకులు గద్దల వెంకటేశ్వర్లు, కనకయ్య, కంచర్ల అచ్చయ్యతో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ ప్రజావాణిలో 37 ఫిర్యాదులను స్వీకరించిన పోలీస్ కమిషనర్




**నిజామాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** నిజామాబాదు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల యొక్క ఎస్.ఐ,సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని,పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది.ప్రజలు నిర్భయంగా,మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా,ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్చందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా,పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా,శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలియజేశారు.ప్రజా సమస్యల పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలియజేశారు.

14 | నేటి శుభోదయ | మంగళవారం | హైదరాబాద్ | 08 - 09 - 2026 | www.netisubhodaya.com



# నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో మహిళా జర్నలిస్టు పై పోలీసుల దాడికి నిరసన






**నిజామాబాద్ జిల్లా, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** మహిళా జర్నలిస్ట్ పై ఢిల్లీ పోలీసుల దాడికి నిరసనగా సోమవారం నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ జర్నలిస్ట్ సంఘాల పిలుపుమేరకు ఢిల్లీలోని ముస్లిం మహిళ జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసులు విచక్షణ రహితంగా దాడులు చేసినందుకు ఢిల్లీ పోలీసులపై వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.నిరసన కార్యక్రమంలో ఉర్దూ,తెలుగు ప్రింట్,ఎలక్ట్రానిక్,సోషల్ మీడియా జర్నలిస్టులందరూ అధిక సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంచారెడ్డి శ్రీకాంత్,వాగ్మేర్ సుభాష్ లతో పాటు ఉర్దూ జర్నలిస్ట్ సంఘాల సీనియర్ నాయకుడు పప్పా ఖాన్ మాట్లాడుతూ......ఢిల్లీలో మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడులకు నిరసనకు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.నిజంగా జర్నలిస్టు సమాజంలో ఫోర్త్ స్టేట్ ఉన్న జర్నలిస్టులపై పోలీసులు దాడి చేయడం హీనమైన చర్యగ భావిస్తున్నామని వారన్నారు.మహిళా జర్నలిస్టుల పై దాడులు జరిపిన ఢిల్లీ పోలీస్ లపై శాఖ పరమైన చర్యలు తీసుకొని వారిని తక్షణమే విధుల నుంచి భర్తరాఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.లేనియెడల వారిపై చర్యలు తీసుకునే వరకు దేశవ్యాప్తంగా ఇలాంటి ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.దేశంలో వైద్యులపై దాడులు జరిపితే వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి దాడి చేసిన వారీపట్ల చర్యలు తీసుకునే విధంగా ప్రత్యేకంగా చట్టాన్ని అమలు చేసిన విషయం తెలిసిందే.అదే తరహాలో అన్యాయం,అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ ఆస్తులను దండుకుంటున్న వారి పట్ల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మహిళా జర్నలిస్టులు గాని పురుష జర్నలిస్టులు కానీ తమ విధులను సక్రమంగా నిర్వర్తించి ఎప్పటికప్పుడు అక్రమాలకు పాల్పడే ప్రభుత్వాలపై తిరుగుబాటు చేస్తూ ప్రజలకు నిజాలను తెలియజేసే విధంగా విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులపై ఇలాంటి దాడులు జరపడం సిగ్గుచేటని వారన్నారు.ఇలాంటి దాడులు పునరవృత్తం కాకుండా ఉండాలంటే జర్నలిస్టులపై దాడులను ఆరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.అంతేకాకుండా ప్రభుత్వాలకు వత్తాసు పలుకుతూ ఎక్కడ కూడా ఎలాంటి తప్పులు చేయకుండా నికాసుగా వార్త రూపంలో తెలుగు,ఇంగ్లీష్,ఉర్దూ ప్రింట్ అనే ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పూర్తి సమాచారాన్ని సేకరించి ఒక వైపు నాయకులు మరోవైపు అధికారుల అక్రమ బండారాలను బయటపెట్టుతున్న జర్నలిస్టులపై ఇలాంటి దాడులకు పాల్పడడం చాలా బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా ఢిల్లీ పోలీసులు ముస్లిం మహిళా జర్నలిస్ట్ అయిన షహీన్ నఫీజ్ లపై ప్రత్యేకంగా వారి కులాలను దృష్టిలో పెట్టుకొని ఇష్టం వచ్చినట్టుగా దాడి చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు.రాబోయే రోజులలో ఢిల్లీలోని పోలీసులపై దేశ వ్యాప్తంగా ధర్నాలు నిరసన కార్యక్రమాలు చేపట్టి జర్నలిస్టులకు క్షమాపణ చెప్పే వరకు ఈ నిరసన ఉద్యమ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు తీవ్రంగా హెచ్చరించారు.అంతకుముందు జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకు వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది.అనంతరం నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఢిల్లీలో ముస్లిం మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడులను ఖండిస్తూ తక్షణమే బాధితులపై శాఖామైన చర్యలు చేపట్టి వారికి విధుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాలు అందజేశారు.ఈ నిరసన కార్యక్రమంలో నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు పంచారెడ్డి శ్రీకాంత్,డాక్టర్ వాగ్మారే సుభాష్,రాజ్ కుమార్,రాజు,భాస్కర్ గౌడ్,స్వామి,ప్రీతం రెడ్డి, రవిచరణ్ రెడ్డి,రతన్ రెడ్డి,వివిధ జర్నలిస్ట్ సంఘాల నాయకులు అరవింద్ బాలాజీ,పాకాల నరసింహులు, మహేందర్, కళ్యాణ్, ప్రేమ్ కుమార్, రాజేష్, సందీప్,గణేష్,విజయ్ కుమార్ లతోపాటు ఉర్దూ జర్నలిస్టులు ఖాలేద్,పప్పా ఖాన్,లక్కీ ఫోదిన్నొద్దిన్,హెచ్ ఫీస్ లైక్,షకీల్ షాప్,మజీద్ భాయ్ అఖిల్,యూ నోస్,యాసీన్ ఉస్మాన్ భాయ్,నదీమ్,నయన్ ఖామర్,గఫర్,యూసుఫ్ తదితరులు జర్నలిస్ట్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నోటీసుల జారీ ప్రక్రియ మరో 5 రోజుల్లో పూర్తి

## - జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- మ్యాపింగ్ లేని, అనామలీస్ ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ
- నోటీసు జారీ చేసిన 7 రోజుల అనంతరం నిబంధనల ప్రకారం విచారణ
- హియరింగ్ అనంతరం డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు
- ఎస్ఐఆర్ పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్






**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ఎస్ఐఆర్ నోటీసుల జారీ ప్రక్రియను మరో 5 రోజుల్లో పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ తెలిపారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోటీసుల జనరేషన్, జారీ, విచారణలు, డేటా నమోదు తదితర అంశాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, జనరేట్ చేసిన నోటీసులు, ఓటర్లకు నోటీసుల జారీ, నిర్వహించిన విచారణల వివరాలను సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ నోటీసుల జారీ ప్రక్రియను మరో 5 రోజుల్లో పూర్తి చేస్తామని, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా గుర్తించిన 1.75 లక్షల ఓటర్లకు సంబంధించి ఇప్పటివరకు 1.40 లక్షల నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. మిగిలిన నోటీసుల జనరేషన్, సంబంధిత ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను మరో ఐదు రోజుల్లో పూర్తి చేస్తామని, ఇప్పటి వరకు సుమారు 20 వేల విచారణలు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎటువంటి మ్యాపింగ్ లేని ఓటర్లు, అనామలీస్ ఉన్న ఓటర్లకు సంబంధించి నోటీసులు తప్పనిసరిగా జనరేట్ చేసి, సంబంధిత ఓటర్లకు జారీ చేస్తున్నట్లు, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నోటీసు జారీ చేసిన అనంతరం కనీసం ఏడు రోజుల వ్యవధి ఉండేలా చూసి విచారణ నిర్వహిస్తున్నట్లు, విచారణ ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 12వ వార్షికోత్సవం పూర్తి చేసుకున్న నయాబ్ రియల్ ఎస్టేట్

## - నయాబ్ గ్రూప్ అధినేత మహమ్మద్ వాజీద్



**సంగారెడ్డి, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** నయాప్ రియల్ ఎస్టేట్ రంగంలో 12 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం జరిగిందని నయాబ్ గ్రూప్ అధినేత మహమ్మద్ వాజిద్ తెలిపారు. ఈ సందర్భంగా వాజిద్ మాట్లాడుతూ నయాబ్ సంస్థ స్థాపించి 12 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నయాబ్ వెంచర్లో కొనుగోలుదారులకు మార్కెట్ లోని ధర కన్నా 30% డిస్కౌంట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. నయాబ్ సంస్థ రియల్ ఎస్టేట్లో ఇప్పటివరకు పదివేల ప్లాట్లు కస్టమర్లకు అమ్మడం జరిగింది అన్నారు. కస్టమర్ల నుండి ఇలాంటి కాంప్లెట్లు లేకుండా బిజినెస్ నిర్వహించమన్నారు. 10 వెంచర్లు పూర్తి చేశామని, మరో 8 వెంచర్లను మార్కెట్లోకి తీసుకొస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ పజిల్, మహమ్మద్ వజహేత్,మహమ్మద్ మేనేజ్మెంట్ డైరెక్టర్, మరియు నయా గ్రూప్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల సీఎం రేవంత్ రెడ్డి విఫల పాలనపై ప్రజావాణిలో బీఆర్ఎస్ వినతిపత్రం



**సంగారెడ్డి, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** వెయ్యి రోజుల సీఎం రేవంత్ రెడ్డి విఫల పాలనకు నిరసనగా, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆదేశాల మేరకు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారి సూచనల మేరకు బీఆర్ఎస్ నాయకులు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రాలు అందజేశారు.ఎన్నికలకు ముందు ప్రజలకు ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటికైనా ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పాండుకు వినతిపత్రం అందజేశారు.అదేవిధంగా, నాలుగు మండల కేంద్రాల్లోని ప్రజావాణి కార్యక్రమాల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి, చింత సాయినాథ్, డాక్టర్ శ్రీహరి, మందుల వరలక్ష్మి , మనోహర్ గౌడ్, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పినపాకలో విద్యార్థులకు పాఠశాల యూనిఫాంల పంపిణీ



**పినపాక, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** పినపాక మండలంలోని ఎంపీపీఎస్ గోపాలరావుపేట, ఎంపీపీఎస్ గోవిందాపురం పాఠశాలల్లో విద్యార్థులకు పాఠశాల యూనిఫాంలను పంపిణీ చేసినట్లు ఎంఈఓ కొమరం నాగయ్య తెలిపారు. సోమవారం పాఠశాలల వద్ద విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి, ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, యూనిఫాంలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. యూనిఫాంల పంపిణీతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్టీ లు పాల్గొన్నారు

Neti Shubodyaa 08.09.2026_Layout 1 9/8/2026 7:12 AM Page 15



# కురవి ప్రభుత్వ భూములపై కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు

- ఎస్సీ బాలికల వసతిగృహాన్ని మార్చాలి...
- సర్వే నంబర్ 177లో ప్రభుత్వ భూములను కాపాడాలని విజ్ఞప్తి
- అసైన్డ్ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టాలి
- దైద భద్రయ్య, నూతకి సాంబశివరావు, కిన్నెర మల్లయ్య, ఇరుగు వెంకన్న డిమాండ్



**మహబూబాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ప్రభుత్వ, ఎస్సీ బాలికల వసతిగృహాన్ని మార్చాలని, సర్వే నంబర్ 177లో ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ గౌరవ జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ మహబూబాబాద్‌కు ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేశారు. విద్యార్థినుల భద్రత, ప్రభుత్వ భూముల పరిరక్షణ, అసైన్డ్ భూముల ఆక్రమణలపై అధికారులు సమగ్రంగా స్పందించాలని ఫిర్యాదుదారులు విజ్ఞప్తి చేశారు.

**ఎస్సీ బాలికల వసతిగృహాన్ని మార్చాలి :**

ప్రస్తుతం ఉన్న ఎస్సీ బాలికల వసతిగృహ భవన పరిస్థితులను పరిశీలించి, విద్యార్థినులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, భద్రతా సదుపాయాలు కలిగిన సురక్షిత భవనంలోకి వసతిగృహాన్ని మార్చాలని కోరారు. విద్యార్థినుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రభుత్వ భూముల కబ్జాలపై సమగ్ర విచారణ:**

కురవి మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అక్రమ ఆక్రమణలు, నిబంధనలకు విరుద్ధంగా భూముల బదలాయింపులు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**సర్వే నంబర్ 177ను పరిరక్షించాలి:**

కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 177లో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములు అక్రమంగా చేతులు మారకుండా రికార్డులను పరిశీలించి, అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రజావాణి ఫిర్యాదులో దైద భద్రయ్య – దళిత అవార్డు గ్రహీత, కురవి మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు; నూతకి సాంబశివరావు – వార్డు సభ్యులు; కిన్నెర మల్లయ్య – సావిత్రీబాయి పూలే అవార్డు గ్రహీత; ఇరుగు వెంకన్న – కురవి మేజర్ గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు పాల్గొని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యలపై సమగ్ర విచారణ జరిపి, సంబంధిత శాఖల అధికారులతో చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

# సుల్తాన్‌పల్లిలో రూ.కోటితో అభివృద్ధి పనులకు శ్రీకారం



**శంషాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** సుల్తాన్‌పల్లి కేబీ దొడ్డి గ్రామంలో సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను సర్పంచ్ ఎల్లని ప్రభాకర్ గౌడ్ ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో పారిశుధ్య సమస్యల పరిష్కారంతో పాటు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు. వర్షాకాలంలో డ్రైనేజీ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దండు ఇస్తారి, ఉప సర్పంచ్ దండు శివకుమార్, వార్డు సభ్యులు మనీషా జనార్దన్, బల్వంత్ రెడ్డి, బేగరి జగన్, నర్సింగ్, స్వప్న సిద్దయ్య, సుమిత్ర మల్లికార్జున్, గ్రామ పెద్దలు, నాయకులు ఆగి రెడ్డి, సిద్దిక్, రాజు, నర్సింహ, పోచయ్య, బాలరాజ్, శ్రీను, సాయి, రవి, గ్రామ కార్యదర్శి, కారోబార్‌తో పాటు పలువురు గ్రామ నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పువ్వాడ ఉదయ నగర్ సర్పంచ్ కార్యదర్శి లపై కలెక్టర్ కు ఫిర్యాదు

**- ఇల్లు కూల్చిన ఘటనలో నిందితులపై చర్యలు తీసుకునేలా ఆదేశించాలని బాధిత మహిళల వినతి**

**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ఒంటరి మహిళ అయినా తనకు 2017వ సంవత్సరంలో ప్రభుత్వం తనకు 75 చదరపు గజముల స్థలాన్ని , పట్టా తో పాటు ఇంటి నెంబరు 1 – 85 ను మంజూరు చేయగా ఆనాటి నుండి తాను సదర్ ఇంటిలో ఇంటి పన్ను చెల్లిస్తూ కరెంటు మీటరు పంపు కనెక్షన్లు కూడా మాంజం చేసుకొని ఈ మధ్యకాలంలో ఇందిరమ్మ ఇల్లును కూడా అనుమతులు తెచ్చుకొని ఇన్నాళ్లుగా రేకుల ఇంటిలో నివసించిన తనను కబ్జాదారు గా చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో తనపై కొందరు ఉద్దేశపూర్వకంగా అనుచిత వాక్యాలు చేస్తున్నారని, ముఖ్యంగా పువ్వాడ ఉదయ్ నగర్ సర్పంచ్ సిద్దిక్, గ్రామ కార్యదర్శి మహేష్ లు తనపై కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ భూక్య ఉపేంద్రబాయి అనే మహిళ సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా ఖమ్మం జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసింది. తనకు ఏమాత్రం సంబంధంలేని 193 నెంబరు గల ప్లాటును తను ఆక్రమించి నట్లు సర్పంచ్ కార్యదర్శిలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్ స్థానిక తహసిలార్ కార్యాలయం ఎండిఓ కార్యాలయంలో సైతం ఫిర్యాదు చేసినట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇంతే కాకుండా తన వ్యక్తిత్వాన్ని తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగిస్తూ తన భర్తగా బద్రు అనే వ్యక్తిని పేరు జోడించడం వల్ల తనకు మానసికంగా బాధ కలిగించిందని, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంతో పాటు ఎలాంటి విచారణ లేకుండా తనను కబ్జాదారు గా పేర్కొనడం పై సర్పంచ్ కార్యదర్శులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో భూక్య ఉపేంద్ర బాయి విజ్ఞప్తి చేసింది. గత ఆగస్టు మాసంలో 27వ తేదీ రాత్రి 11 సమయంలో పథకం ప్రకారం అన్యాయంగా, అక్రమంగా, తాను లేని సమయంలో తన ఇంటిని గ్రామ సర్పంచ్ సిద్దిక్ ప్రోత్సాహ, ప్రోత్బలంతో కొందరు వ్యక్తులు తన ఇంటిని ధ్వంసం చేశారని ఫలితాలు రెండు లక్షల రూపాయల మేరకు తనకు నష్టం వాటిల్లిందని బాధిత మహిళ భూక్య నాగేంద్ర జిల్లా కలెక్టర్ కు సమర్పించిన వినతి పత్రంలో ఆరోపించారు. ఈ 193 నెంబర్ గల ప్లాటును 2019వ సంవత్సరంలోనే ఆర్సి ఫైల్ నెంబర్ విఆర్ఏఓ /152 / 2019 ఇచ్చి తనకు స్వాధీన పరిచినట్లు ఆనాటి నుండి తాను అక్కడ రేకులతో ఇల్లు నిర్మించుకొని ఆ ఇంటి పై ఇంటి నెంబరు ఓటర్ ఐడి కార్డు కరెంట్ మీటర్లను కూడా సమపాధించుకున్నట్టు తెలిపారు. ఇలా ప్లాట్లకు సంబంధించిన అనేక సర్వేల సందర్భంగా కూడా తాను ఇక్కడే నివసించినట్లు తెలిపారు. తన ఈ ప్లాటుకు ఉపేంద్ర బాయి అనే మహిళకు ఎటువంటి సంబంధం లేకుండా ఆమెను సోషల్ మీడియా ద్వారా వేధిస్తూ ఉన్నటువంటి చర్యలు తీసుకోవాలని వారి కారణంగానే తనను టార్గెట్ చేశారని, ఈ విషయం లో రఘునాధపాలెం సిఐ యాకూబ్ ఇస్మాయిల్ ఫిర్యాదు చేయాలని వారు ఆ సమయంలో అక్కడ లేరని చెప్పటం, పది రోజులు దాటిన దీనిపై ఎఫ్ఐఆర్ చేయకపోవడం గురించి ప్రస్తావిస్తూ వీరందరి పాత్ర పై , ఇల్లు కూల్చిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, తనకు న్యాయం చేయాలని, నిందితులందరిపై ఎస్సీ ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నష్టపరిహారం చెల్లించే విధంగా చూడాలని, అదేవిధంగా వీరి నుండి తనకు రక్షణ కల్పించాలని ఆమె జిల్లా కలెక్టర్ కు సమర్పించిన వినతి పత్రంలో మనవి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు గుంతెటి వీరభద్రం, దాసరి శ్రీను, లింగాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండలి నిర్వాహకులు తప్పకుండా నిబంధనలు పాటించాలి

**- పోలీస్ కమిషనర్ వెల్లడి**

- డి.జేలకు అనుమతులు లేవు పూర్తిగా నిషేధం
- మండపం వద్ద విధ్యుత్ తీగలతో జాగ్రత్తలు పాటించాలి
- వర్షం సందర్భంగా మండపంపైన పాల్దిన్ కవర్స వాడాలి
- రాత్రి 10 గంటలకు లౌడ్ స్పీకర్లు ఆఫ్ చేయాలి
- భారీ విగ్రహాలను తీసుకువెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలి



**నిజామాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** గణేష్ విగ్రహ ఏర్పాటు కోసం ప్రజల నుండి డబ్బులను బలవంతంగా వసూలు చేయరాదు.గణేష్ మండపాలను ఎవరికి,ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి.మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారికి సమాచారం ఇవ్వవలెను.గణేష్ మండళ్ల వద్ద సందర్శించే మహిళలపై,యువతులపై ఈవ్ టీజింగ్ జరుగకుండా చూడవలెను.ప్రజలకు అసౌకర్యం కలుగకుండా డి.జె/డి.జె మిక్సర్స్/ హైఫిడిలిటి (హైఫై) సౌండ్సిస్టమ్ ఇక్విప్మెంటు విషయంలో చాలా జాగ్రతలు వహించాలి.కొద్ది మంది ఇండ్లలో గుండె జబ్బులు,బి.పి,వయసు పై బడిన వృద్దులు ఉంటారు.చదువుకునే విద్యార్థులకు ఆటంకము కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.ఇట్టి సౌండ్ 12 Decibels దాటి ఉండరాదు.రాత్రి 10 గంటలకు లౌడ్ స్పీకర్లు ఆఫ్ చేయాలి.ఈ విషయంలో సుప్రీంకోర్టు నిబంధనలను పాటించాలి.లేని యెడల చట్టరిత్య చర్యలు తీసుకొనబడును.డి.జే లు పూర్తిగా నిషేదం.మైక్ పర్మిషన్ కోసం సంబంధిత ఎ.సి.పి ని సంప్రదించి తప్పనిసరిగా పర్మిషన్ తీసుకోవాలి.విధ్యుత్ సరఫరా ఆగకుండా వీధి దీపాలు వెలిగేటట్లు చూడవలెను.షార్టు సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరు ను ఉపయోగించాలి.ప్రతీ చోట ఎమ్.సి.బి ఏర్పాటు చేయాలి.ప్రజలకు అసౌకర్యం కలుగజేసే ఎటువంటి చిన్న సమాచారాన్ని అయిన మీ దగ్గరలోని పోలీసులకు తెలుపండి.లేదా డయల్ 100 కు ఫోన్ చేయగలరు.లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్: 87126– 59700 కు తెలపాగలరు.ప్రతీ గణేష్ మండలి వద్ద ఉదయం,రాత్రి వేళలో ఇద్దరూ లేదా ముగ్గురికి తక్కువ కాకుండా తమ కమిటీ మెంబర్లను మండలి వద్ద ఉంచవలెను.పోలీస్ వారు చెకింగ్ కు వచ్చినప్పుడు ప్రతీసారి కనబడవలెను. మండపము దగర అసాంఘిక చర్యలు లేకుండా చూసుకోనవలయును.ప్రతి గణేష్ మండలి దగ్గర విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి.పోలీసు అధికారుల తనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారు.అపరిచిత వ్యక్తుల గూర్చి సమాచారం తెలియజేయాలి.మీ దగ్గరలో ఎవ్వరయిన అనుమానస్పదంగా బ్యాగులు,ప్లాస్టిక్ సంచూలు వదిలినట్లయితే వాటిని తాకరాదు.అట్టి సమాచారం దగ్గరలోని పోలీస్ అధికారులకు తెలుపండి.గణేష్ మండలి పూర్తి వివరములు నిమజ్జనం కొరకు ఏ రోజు ఎక్కడికి ఏ మార్గం ద్వారా తీసుకు వెళ్తారనే సమాచారం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ముందుగానే తెలుపండి.గణేష్ ప్రతిమలు కూర్చుండబెట్టే ప్రదేశంలో షెడ్ నిర్మాణంలో మంచి నాణ్యత గల షెడ్ ఏర్పాటు చేయవలెను.గణేష్ ప్రతిమలు కూర్చుండబెట్టే వేదిక చాలా బలంగా ఉండేటట్లు చూసుకోవాలి.పూజా కార్యాక్రమంలో "క్యూ" పద్దతి పాటించాలి."బారికేడ్లను" విధిగా ఏర్పాటు చేసుకోవాలి.ప్రత్యేకంగా లైటింగ్ సౌకర్యం కోసం మంచి నాణ్యత గల వైరు తో ప్లాస్టిక్ పి.వి.సి పైప్ ద్వారా లైటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలి.పూర్తి సురక్షితమైన కవరుతో ఉన్న ఫడ్లెట్లను మాత్రమే వాడాలి.ఎప్పుడైన అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ముందు జాగ్రత్తలో భాగంగా దగ్గరలో రెండు బకెట్ల నీళ్లు,ఇసుక ఏర్పాటు చేసుకోవాలి.ఫైర్ బాల్స్ సమకూర్చుకోవాలి.యువకులు కోపతాపాలకు వెళ్లకుండా సంయమనం పాటించే విధంగా చర్యలు తీసుకోవాలి.ఎటువంటి రూమర్స్ ను నమ్మరాదు.ప్రజలకు అసౌకర్యం కలుగ కుండా నిరంతర పోలీస్ నిఘా ఏర్పాటు చేయబడింది.సంబంధిత నిర్వాహకులు అవసరం నిమిత్తం ఉపయోగించుట కొరకు మీ దగ్గరలోని పోలీస్ సిబ్బంది ఫోన్ నెంబర్లను వ్రాసి పెట్టు కోనగలరు.వీలైనంతవరకు మట్టి,తక్కువ ఎత్తుగల గణపతులను ప్రోత్సాహించండి పర్యావరణాన్ని కాపాడండి.గణేష్ భక్తులు,నిర్వాహకులు మద్యపానానికి దూరంగ ఉండవలెను.గణేష్ మండళ్ల వద" పేకాట"ఆడరాదు.టపాసుల నిషేదం.నిమజ్జనం రోజు పోలీసు వారు జారీ చేసిన నియమ నిబంధనలు పాటిసూ విగ్రహాన్ని (రథాన్ని) "క్యూ" లో ఉండే విధంగా చర్యలు తీసుకోగలరు.ప్రతీ రథనికి లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలి.నిమజ్జనం రోజు వీలయినంత వరకు చిన్న పిల్లలు ఉండకుండా చూసుకోవాలి.ఎక్కువ జనసమూహం ఉన్నప్పుడు "దొంగతనాలకు ఆస్కారము ఎక్కువగా ఉంటుంది కాబట్టి చిల్లర దొంగల పై జాగ్రత్త వహించాలి.నిమజ్జనం రోజు భజన కార్యక్రమం చేసేవారు పర్మిషన్ తీసుకొనవలెను.నిమజ్జనం రోజు వారి వారి అనుకూలానుసారం బావులలో చెఱువులలో కాలువలలో లేదా గోదావరిలో మొదలగు చోట్ల వేసేటప్పుడు పెద్దవారు మాత్రమే ముందుకు వెళ్లి విగ్రహన్ని వేయాలి.ప్రత్యేకంగా ఈత వచ్చిన వారు ఉండవలెను.పోలీస్ వారి సూచనల మేరకు నిమజ్జనం చేయవలెను.అవసరానుకూలంగా సి.సి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.నిమజ్జనంచేసే సమయంలో ఎవ్వరు కూడా విన్యాసాలు చేయకూడదు. సెల్ఫోన్లో సెల్ఫీలు దిగవద్దు.వినాయక విగ్రహం తీసుకొని వచ్చే రోడ్డులో కానీ వినాయక విగ్రహం తీసుకొని వెళ్లే రూటులో కానీ ఎంత ఎత్తు గలదో అట్టి దారి పొడవున ముందుగానే చూసుకోవాలి.ఎక్కడ ఎలాంటి ప్రమాదము జరగకుండా ముందుగానే అన్ని రకాల జాగ్రత్తలు పాటించవలెను.ప్రజలు పోలీసులకు ఎల్లప్పుడు సహకరించవలెను.

16 నేటి శుభోదయ
మంగళవారం | హైదరాబాద్
08 - 09 - 2026
www.netisubhodaya.com



# అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలి

## - నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ డోర్నకల్ నియోజకవర్గ కార్యదర్శి

**మహబూబాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** భూ కబ్జాదారుల పాలవుతున్న విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని సిపిఐ డోర్నకల్ నియోజకవర్గ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. కురవి మండల కేంద్రంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజావాణిలో ఎంపీడీవో వీరబాబుకి సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విలువైన ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ రెవిన్యూ అధికారులు నమ్మకు నేరెత్తినట్లుగా వ్యవహరించడం వలన భూ బకాసురులు బోగస్ పత్రాలతో ఆక్రమించుకుంటున్నారని సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించి సూచిక బోర్డులు పెట్టాలని గతంలో అనేకసార్లు తహిసిల్దార్ కు వినతిపత్రం ఇచ్చినప్పటికీ పెడచెవిన పెట్టడం వలన యదేచ్ఛగా అక్రమనలు జరుగుతున్నాయని, ఎస్సీ హాస్టల్ తో పాటు పలు కార్యాలయాలు ప్రైవేట్ భవనాలలో కిరాయిలకు, ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థలో ఉన్నది కాబట్టి నూతన భవనాల మంజూరి కోసం స్థలాలు కావాలని సాక్షాత్తు ఎమ్మెల్యే రెవిన్యూ అధికారులను కోరినప్పటికీ కాగితాలలో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించకుండా తాత్పర్యం చేయటం,ఇటీవల పలు ఆరోపణలు రెవెన్యూ అధికారులపై వస్తున్నప్పటికీ కనీస స్పందన లేకపోవడంతో పలు అనుమానాలు వస్తున్నాయని,177 సర్వే నెంబర్ లో గత తాహిసిల్దార్ గారు హరిత హోటల్, మహిళలకు పెట్రోల్ బంకులకు,ఎంపీడీవో కార్యాలయానికి స్థలాన్ని ఇస్తానని చెప్పారు కాబట్టి 177 సర్వే నెంబర్ తో పాటు కొరవి గ్రామ కేంద్రంలో ఎంత ప్రభుత్వ భూమి ఉన్నదో తక్షణమే జిల్లా సర్వేయర్ తో సమగ్ర సర్వే చేయించి,హద్దురాళ్ళను సూచిక బోర్డులను కలెక్టర్ గారు ప్రత్యేక చొరవ తీసుకొని ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బుడమ వెంకన్న, దూది కట్ల సారయ్య, కన్న వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# కురవిలో ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ జరపాలి

- 275 ఎకరాల ప్రభుత్వ, సీలింగ్, పి.ఓ.టి, భూదాన్ భూముల రక్షణకు కలెక్టర్‌కు ఫిర్యాదు
- రికార్డులు బహిరంగపరచి.. ఆక్రమణలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**మహబూబాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** మహబూబాబాద్ జిల్లా కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ, సీలింగ్, భూదాన్, పి.ఓ.టి, ప్రజాప్రయోజన భూముల పరిరక్షణకు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ సోమవారం కురవి మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు, దైద భద్రయ్య, రాగం వీరభద్రం, దళిత నాయకులు కిన్నెర మల్లయ్య తదితరులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. కురవి గ్రామ రెవెన్యూ పరిధిలో మొత్తం 275 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ, ఇతర కేటాయించిన భూములు ఉన్నట్లు తెలిపారు. ఇందులో అబాది 43 ఎకరాల 09 గుంటలు, సీలింగ్ భూములు 11 ఎకరాల 19 గుంటలు, ప్రభుత్వ భూమి 158 ఎకరాల 18 గుంటలు, పి.ఓ.టి భూములు 57 ఎకరాల 35 గుంటలు, భూదాన్ భూమి 4 ఎకరాలు ఉన్నట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.

**ఆక్రమణలను అరికట్టాలి :**

ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, కాలువలు తదితర ప్రజాప్రయోజన స్థలాలపై జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న ఆక్రమణలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అడ్డుకోవాలని కోరారు. ప్రతి ప్రభుత్వ భూమిని సమగ్రంగా సర్వే చేసి, సరిహద్దులను గుర్తించి ఫెన్సింగ్ లేదా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**రికార్డులు బహిరంగపరచాలని డిమాండ్ :**

ప్రతి భూమికి సంబంధించిన సర్వే నంబర్, విస్తీర్ణం, భూమి స్వభావం, ప్రస్తుత స్థితి, ఆక్రమణ వివరాలు స్పష్టంగా పొందుపరిచిన నివేదికను గ్రామ పంచాయతీ కార్యాలయంలో, సంబంధిత ఆన్‌లైన్ వేదికల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు.

**రెవెన్యూ—రిజిస్ట్రేషన్ రికార్డులపై విచారణ :**

ధరణి, పాత రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ శాఖ పత్రాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి పరిశీలించాలని ఫిర్యాదుదారులు కోరారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసి, రికార్డుల్లో మార్పులు, అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయా అనే అంశాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

**పి.ఓ.టి భూములపై చర్యలు తీసుకోవాలి**

పి.ఓ.టి/అసైన్డ్ భూముల విషయంలో చట్ట నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు, విక్రయాలు లేదా ఆక్రమణలు జరిగి ఉంటే వాటినీ గుర్తించి, నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కోరారు. చెరువులు, శిఖం భూములు, నీటి వనరులు, కాలువల ఆక్రమణలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం రెవెన్యూ యంత్రాంగం ప్రాథమిక బాధ్యత అని పేర్కొంటూ.. కురవి గ్రామ రెవెన్యూ పరిధిలోని భూములపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచి, ఆక్రమణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కురవి మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు, దైద భద్రయ్య, రాగం వీరభద్రం, దళిత నాయకులు కిన్నెర మల్లయ్య తదితరులు జిల్లా కలెక్టర్‌ను కోరారు.

# 420 హామీలను వెంటనే అమలు చేయాలి

## మూడు చింతలపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన.. ఎమ్మార్వోకు వినతిపత్రం

**శామీర్ పేట, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేసి నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం మూడు చింతలపల్లి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వీరారెడ్డి విగ్రహం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి మూడు చింతలపల్లి ఎమ్మార్వో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు.కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేసి, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి అనిల్ రెడ్డి, కౌన్సిలర్లు అజయ్ పటేల్, నవీన్ నాయక్, శ్రీనివాస్, రమేష్, స్వామి, శ్రీకాంత్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు నవీన్, ఇస్తారి, బలవంత రెడ్డి, మాజీ సర్పంచులు ఆంజనేయులు, గౌస్ బాషా, గ్రామ శాఖ అధ్యక్షుడు యాదగిరి, రైతు అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు విజయ్, సురేష్, మాజీ ఎంపీటీసీ శర్వాన్, బాబు సింగ్, నాయ, మాజీ వార్డు సభ్యులు వెంకటేష్, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# వెల్జాల్ బోనాల ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్‌కు ఆహ్వానం

## - బి ఆర్ ఎస్ యువ నాయకుడు వానరాశి వెంకటేష్



**తలకొండపల్లి, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామంలో వారం రోజుల పాటు నిర్వహించనున్న బోనాల ఉత్సవాలకు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్‌ను గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ ఆదేశాల మేరకు సర్పంచ్ తనయుడు వానరాశి వెంకటేష్ సోమవారం మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. బోనాల పండుగ కార్యక్రమాలకు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని ప్రత్యేకంగా ఆహ్వానం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను ఆయనకు వివరించారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ముజ్బుర్ రెహమాన్, మాజీ వార్డు సభ్యుడు విజయకుమార్, వార్డు సభ్యుడు శేఖర్ యాదవ్, బీఆర్ఎస్ యువ నాయకులు పొద్దుటూరు రాజు గుప్తా, మహమ్మద్ ఇస్మాయిల్, సతీష్ చారి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుడి శోభాయాత్రకు పోటెత్తిన భక్తజనం

## భజనలతో మార్మోగిన ఓల్డ్ మల్కాజిగిరి - మిర్జాల్‌గూడ పరిసరాలు



**మల్కాజిగిరి, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** ఓల్డ్ మల్కాజిగిరి నుంచి మిర్జాల్‌గూడ వరకు నిర్వహించిన శ్రీకృష్ణుడి శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా సాగింది. మహంకాళి ప్రిన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సోమవారం శ్రీకృష్ణుడి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహిళలు, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది.శోభాయాత్రలో భక్తులు భజనలు, కీర్తనలతో సందడి చేయగా, 'గోవిందా.. గోపాలా..' అంటూ శ్రీకృష్ణ నామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. భక్తులు నృత్యాలు చేస్తూ, ఉత్సాహంగా ముందుకు సాగడంతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.మూడు రోజులుగా నిర్వహించిన పూజా కార్యక్రమాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. శ్రీకృష్ణుడి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

# సిద్దులగుట్ట జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** శంషాబాద్ లోని ప్రసిద్ధ సిద్దులగుట్ట వెండికొండ సిద్దేశ్వర స్వామి 71వ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. పవిత్రమైన శ్రావణ మాస ఆఖరి సోమవారం పురస్కరించుకుని ఈ వేడుకలలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దులగుట్ట దేవస్థానంలో కొలువై ఉన్న పరమశివుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయన స్వామివారి తీర్థప్రసాదాలు, ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పవిత్రమైన శ్రావణ మాస ఆఖరి సోమవారం రోజున వెండికొండ సిద్దేశ్వర స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని మనసారా ప్రార్థించినట్లు తెలిపారు. జాతరలో భాగంగా నిర్వహించిన మహామంగళహారతి, మహా రుద్రాభిషేకం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో శివభక్తులు పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యూజే - ఐజేయూ జిల్లా కార్యనిర్వహణా కమిటీ (ఈ.సి) సభ్యుడిగా నీలి శ్రీకాంత్ నియామకం



**నేటి శుభోదయ, సంగారెడ్డి ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నిర్వహించిన తెలంగాణ యోజన వర్కింగ్ జర్నలిస్ట్ ఐజేయు నియోజకవర్గ సమావేశంలో. సదాశివపేటకు చెందిన సీనియర్ పాత్రికేయులు నీలి శ్రీకాంత్ ను జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా నీలి శ్రీకాంత్ మాట్లాడుతూ నియామకాన్ని స్వాగతించదగినదిగా అభివర్ణించారు. తనను జిల్లా జిల్లా కమిటీలో సభ్యునిగా నియమించడంతో తను బాధ్యతగా నడుచుకుంటూ జిల్లా సంఘానికి మరింత బలుపితం కోసం కృషి చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించినందుకు ప్రత్యేకంగా తెలంగాణ యూనియన్ ఆఫర్ కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ ఖాదిర్ ఫైసల్ గారికి , జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి , సదాశివపేట తాలూకా అధ్యక్షులు ఎండి హాజీ , జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశం , జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కోశాధికారి సిద్దు , జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ ఉల్లిగడ్డల శివ కుమార్ మరియు ఇతర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

## నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో మహిళా జర్నలిస్టు పై పోలీసుల దాడికి నిరసన






**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07 నేటి శుభోదయ :** మహిళా జర్నలిస్ట్ పై ఢిల్లీ పోలీసుల దాడికి నిరసనగా సోమవారం నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ జర్నలిస్ట్ సంఘాల పిలుపుమేరకు ఢిల్లీలోని ముస్లిం మహిళ జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసులు విచక్షణ రహితంగా దాడులు చేసినందుకు ఢిల్లీ పోలీసులపై వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.నిరసన కార్యక్రమంలో ఉర్దూ,తెలుగు ప్రింట్,ఎలక్ట్రానిక్,సోషల్ మీడియా జర్నలిస్టులందరూ అధిక సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంచారెడ్డి శ్రీకాంత్,వాగ్మేర్ సుభాష్ లతో పాటు ఉర్దూ జర్నలిస్ట్ సంఘాల సీనియర్ నాయకుడు పప్పా ఖాన్ మాట్లాడుతూ......ఢిల్లీలో మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడులకు నిరసనకు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.నిజంగా జర్నలిస్టు సమాజంలో ఫోర్త్ స్టేట్ ఉన్న జర్నలిస్టులపై పోలీసులు దాడి చేయడం హీనమైన చర్యగ భావిస్తున్నామని వారన్నారు.మహిళా జర్నలిస్టుల పై దాడులు జరిపిన ఢిల్లీ పోలీస్ లపై శాఖ పరమైన చర్యలు తీసుకొని వారిని తక్షణమే విధుల నుంచి భర్తరాఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.లేనియెడల వారిపై చర్యలు తీసుకునే వరకు దేశవ్యాప్తంగా ఇలాంటి ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.దేశంలో వైద్యులపై దాడులు జరిపితే వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి దాడి చేసిన వారీపట్ల చర్యలు తీసుకునే విధంగా ప్రత్యేకంగా చట్టాన్ని అమలు చేసిన విషయం తెలిసిందే.అదే తరహాలో అన్యాయం,అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ ఆస్తులను దండుకుంటున్న వారి పట్ల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మహిళా జర్నలిస్టులు గాని పురుష జర్నలిస్టులు కానీ తమ విధులను సక్రమంగా నిర్వర్తించి ఎప్పటికప్పుడు అక్రమాలకు పాల్పడే ప్రభుత్వాలపై తిరుగుబాటు చేస్తూ ప్రజలకు నిజాలను తెలియజేసే విధంగా విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులపై ఇలాంటి దాడులు జరపడం సిగ్గుచేటని వారన్నారు.ఇలాంటి దాడులు పునరవృత్తం కాకుండా ఉండాలంటే జర్నలిస్టులపై దాడులను ఆరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.అంతేకాకుండా ప్రభుత్వాలకు వత్తాసు పలుకుతూ ఎక్కడ కూడా ఎలాంటి తప్పులు చేయకుండా నికాసుగా వార్త రూపంలో తెలుగు,ఇంగ్లీష్,ఉర్దూ ప్రింట్ అనే ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పూర్తి సమాచారాన్ని సేకరించి ఒక వైపు నాయకులు మరోవైపు అధికారుల అక్రమ బండారాలను బయటపెట్టుతున్న జర్నలిస్టులపై ఇలాంటి దాడులకు పాల్పడడం చాలా బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా ఢిల్లీ పోలీసులు ముస్లిం మహిళా జర్నలిస్ట్ అయిన షహీన్ నఫీజ్ లపై ప్రత్యేకంగా వారి కులాలను దృష్టిలో పెట్టుకొని ఇష్టం వచ్చినట్టుగా దాడి చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు.రాబోయే రోజులలో ఢిల్లీలోని పోలీసులపై దేశవ్యాప్తంగా ధర్నాలు నిరసన కార్యక్రమాలు చేపట్టి జర్నలిస్టులకు క్షమాపణ చెప్పే వరకు ఈ నిరసన ఉద్యమ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు తీవ్రంగా హెచ్చరించారు.అంతకుముందు జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకు వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది.అనంతరం నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఢిల్లీలో ముస్లిం మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడులను ఖండిస్తూ తక్షణమే బాధితులపై శాఖామైన చర్యలు చేపట్టి వారికి విధుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాలు అందజేశారు.ఈ నిరసన కార్యక్రమంలో నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు పంచారెడ్డి శ్రీకాంత్,డాక్టర్ వాగ్మారే సుభాష్,రాజ్ కుమార్,రాజు,భాస్కర్ గౌడ్,స్వామి,ప్రీతం రెడ్డి, రవిచరణ్ రెడ్డి,రతన్ రెడ్డి,వివిధ జర్నలిస్ట్ సంఘాల నాయకులు అరవింద్ బాలాజీ,పాకాల న ర సింహులు, మ హేంద ర్, క ళ్యాణ్, ప్రేమ్ కుమార్,రాజేష్,సందీప్,గణేష్,విజయ్ కుమార్ లతోపాటు ఉర్దూ జర్నలిస్టులు ఖాలేద్, పప్పా ఖాన్,లక్కీ ఫోదిన్నొద్దిన్,హెచ్ ఫీస్ లైక్,షకీల్ షాప్, మజీద్ భాయ్ అఖిల్,యూ నోస్,యాసీన్ ఉస్మాన్ భాయ్, నదీమ్, నయన్ ఖామర్,గఫర్,యూసుఫ్ తదితరులు జర్నలిస్ట్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 100 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్ళు పంపిణీ




**ఖమ్మం, సెప్టెంబర్ 7, నేటి శుభోదయ :** రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం వారు నిర్వహిస్తున్న ఖమ్మం రోటరీ ట్రస్ట్ ద్వార 100 మంది దివ్యాంగులకు జైపూర్ పరిజ్ఞానంతో తయారుచేయబడిన కృత్రిమ కాళ్ళు పంపిణీ చేయుట జరిగింది. ఈ ప్రాజెక్టు వ్యయం మొత్తం 4,85,000/- (నాలుగు లక్షల ఎనభై ఐదు వేలు). అమెరికాలోని ఏకం , యూ ఎస్ ఏ వారు విరాళంగా అందించారు. ప్రస్తుత సంవత్సరం వారు నాలుగు లేదా ఐదు సార్లు ఈ విధంగా సహాయం చేయడం, ప్రమాదవశాత్తు , మధుమేహవ్యాధి లేక ఇతర కారణముల వలన కాళ్ళు కోల్పోయిన వారికి ఉచితంగా జైపూర్ సాంకేతికతతో కాళ్ళను ఖమ్మంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం యందు తయారుచేసి ఇవ్వటం జరిగింది. ఏకం సంస్థ వారు చేయుచున్న సహాయం మరువరానిది . వారి సేవలను పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రోటరీ ట్రస్ట్ చైర్మన్ మల్లాది వాసుదేవ్ , కార్యదర్శి దొడ్డపనేని సాంబశివరావు , కోశాధికారి వంగాల జగన్నాధం , సర్వీస్ కోఆర్డినేటర్ పసుమర్తి రంగారావు , రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం అధ్యక్షులు హరి శ్రీనివాస్ , కార్యదర్శి ప్రసాద్ , కోశాధికారి రామకృష్ణ , నల్లమోతు రవీంద్రనాథ్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రతిపక్షాల నిరసనలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం - కొనమొల్ల శ్రీనివాస్





**శంషాబాద్, సెప్టెంబర్ 07, నేటి శుభోదయ :** అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల పట్ల పోలీసులు, కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును నిరసిస్తూ శంషాబాద్‌లో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. అంబేద్కర్ చౌరస్తాలో కొత్వాల్గూడ 119వ డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. కొనమొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల ప్రజాస్వామ్య హక్కు అని అన్నారు. ప్రతిపక్ష నాయకుల నిరసనలను అడ్డుకోవడం, పోలీసుల ద్వారా వారిని నిర్బంధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజల తరపున ప్రశ్నించే నాయకుల గొంతుకను అణచివేయకుండా ప్రభుత్వం వారి అభిప్రాయాలను గౌరవించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో 118, 119 డివిజన్ల నాయకులు, మండల స్థాయి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్పీకర్‌ను అవమానించడం సిగ్గుచేటు



**శంషాబాద్, సెప్టెంబర్ 07, నేటి శుభోదయ :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకమర్రి నరసింహ అన్నారు. అంబేద్కర్ ఆశయాల ఫలితంగా అట్టడుగు వర్గాలకు చెందిన వారు ఉన్నత పదవులను అధిరోహిస్తున్న సమయంలో వారిని కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. చట్టసభల్లో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సభ్యులు వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని పేర్కొన్నారు. దళితులు, మహిళలు, బీసీలు, ఎస్టీల పట్ల గౌరవభావంతో వ్యవహరించాలని సూచించారు. చట్టసభల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులందరిపైనా ఉందని, భవిష్యత్తులో ఇలాంటి వైఖరిని ప్రజలు తిరస్కరించాలని నరసింహ కోరారు.

## న్యాయవృత్తి హక్కుల సాధనకై న్యాయవాద పరిషత్ కృషి..





**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07 నేటి శుభోదయ :** న్యాయవాది పరిషత్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు జిల్లా కోర్టు భవనంలోని బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారు కృష్ణానంద్ మాట్లాడుతూ....న్యాయవాదుల వృత్తిపరమైన రక్షణకే న్యాయవాది పరిషత్ కృషి చేస్తుందని,చట్ట పరమైన సంస్కరణలకు ఆలోచన సంక్షేమకై దేశ వ్యాప్తంగా పనిచేస్తున్న ఏకైక సంస్థ న్యాయవాద పరిషత్ అని పేర్కొన్నారు, న్యాయవాదుల అభ్యున్నతికై న్యాయవాదులందరు పరిషత్తో కలిసి రావాలని కోరారు,ఈ సందర్భంగా న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో న్యాయవాద సమాజంలో అఖిల భారతీయ అదివత్త పరిషత్ గా ప్రారంభమై రాష్ట్రంలో తెలంగాణ న్యాయవాద పరిషత్ ఆవిర్భవించి భారతీయ సంస్కృతి నైతిక విలువ వృత్తి గౌరవం సమాజ శ్రేయస్సు జాతీయవాద దృక్పథంతో న్యాయవాద పరిషత్ న్యాయ రంగంలో పనిచేస్తుందని న్యాయవాదుల సంక్షేమం కోసం సమాజాభివృద్ధి కోసం అందరూ ఐక్యంగా తమతో కలిసి పని చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.సుభాష్,న్యాయవాదులు ఎర్రం విఘ్నేష్,వసంత్ రావు, మానిక్ రాజ్,ఆశ నారాయణ,బంటు వసంత్,సంతోష్ నాగ్,ఉదయ్ రోహన్, కార్తీక్,రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

18 నేటి శుభోదయ
మంగళవారం | హైదరాబాద్
08 - 09 - 2026
www.netisubhodaya.com



# భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు.. అంగరంగ వైభవంగా పండుగ



**కేశంపేట, సెప్టెంబర్ 7, నేటి శుభోదయ :** మండల కేంద్రంలో పోచమ్మ బోనాల పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు ఎత్తుకుని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండా-లని భక్తులు ప్రార్థించారు.బోనాల సంద-ర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు భక్తి గీతాలు ఆలపిస్తూ, బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. డప్పులు, డోలు తదితర వాయిద్యాల నడుమ నిర్వహించిన ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డప్పు వాయిద్యాల శబ్దాలతో కేశంపేట పురవీధులు మారుమోగాయి. యువత, చిన్నారులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామ ప్రజలు ఐకమత్యంతో పాల్గొని సంప్రదాయాలను కొనసాగించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

## - మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి



**వికారాబాద్, సెప్టెంబర్ 7, నేటి శుభోదయ :** తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, కించపరిచే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, టీజేఎంయూ గౌరవ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి తెలిపారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని అన్నారు.అధికారం కోల్పోయిన అక్కసుతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. తాతా మధు వెంటనే స్పీకర్‌కు, ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, ఘటనపై శాసనమండలిలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలను ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాలని అర్థ సుధాకర్ రెడ్డి కోరారు.

# బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు..

## ప్రజల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది : గణేష్ బిగాల



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07 నేటి శుభోదయ :** నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో 12వ డివిజన్ ధర్మపురి హిల్స్‌లో యువ నాయకుడు SK అమీర్ జలాల్ తన మద్దతుదారులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా గణేష్ బిగాల వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా గణేష్ బిగాల మాట్లాడుతూ....సాధారణంగా ఏదైనా లాభం పొందాలనుకునే వారు అధికార పార్టీలో చేరుతారని,కానీ ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలోకి పెద్ద ఎత్తున చేరికలు జరుగుతుండటం ప్రజల్లో వస్తున్న మార్పుకు నిదర్శనమన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను,ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.ఇచ్చిన హామీలను గాలికి వదిలేయడంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు.బీఆర్ఎస్ పార్టీ పట్ల ప్రజల్లో మళ్లీ ఆదరణ పెరుగుతోందని,రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని,మళ్లీ సీఎం కేసీఆర్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని గణేష్ బిగాల అన్నారు.ప్రతి డివిజన్‌లో బీఆర్ఎస్‌లో జరుగుతున్న భారీ చేరికలు దీనికి నిదర్శనమని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీకి మరింత ఆదరణ పెరిగి,తెలంగాణ ప్రజలు మరోసారి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కడతారని గణేష్ బిగాల ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నవీద్ ఇక్బాల్, సమీ, సనా ఉల్లా, సిర్ప రాజు,సుజిత్ సింగ్,ప్రభాకర్ రెడ్డి,దండు శేఖర్,జగత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మధుబన్ కాలనీలో రోడ్డు విస్తరణ పనులకు ఏడు లక్షల మంజూరు



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 7, నేటి శుభోదయ :** రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ రోజు ఉదయం మధుబన్ కాలనీ, శ్రీరామ్ నగర్ కాలనీ మధ్యలో గల రోడ్డుకు ఇరువైపులా విస్తరణ పనుల నిమిత్తం ఏడు లక్షల రూపాయలు మంజూరు చేయించడం జరిగింది. కాంగ్రెస్ నాయకులు బస్తీ ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై ప్రజలు నాయకుల దృష్టికి తీసుకురాగా, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టి ప్రేమ్ గౌడ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎన్ ధనుంజయ, అర్జున్ గౌడ్, నాని, శ్రీనివాస్ రెడ్డి, నిరంజన్, ప్రశాంత్ గౌడ్, చిన్న తదితర కాంగ్రెస్ నాయకులు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

# రాఘవేంద్ర హోటల్ ప్రారంభం - నాణ్యత, రుచితో మరింత అభివృద్ధి చెందాలి : డాక్టర్ వర్రే వెంకటేశ్వర్లు యాదవ్



**వరంగల్ నేటి శుభోదయ :** శ్రీ రాఘవేంద్ర మీనాక్షి గ్రూప్ హోటల్స్ నాణ్యత, రుచికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆదరణ పొందుతున్నాయని తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఫిర్యాదుల అథారిటీ కమిషన్ మెంబర్ డాక్టర్ వర్రే వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. నాణ్యమైన ఆహారంతో పాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి విజయవంతంగా ముందుకు సాగాలని కోరుతూ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.సోమవారం చంద్రాయణగుట్ట–బండ్లగూడ సమీపంలో శ్రీ రాఘవేంద్ర మీనాక్షి హోటల్ నూతన బ్రాంచ్‌ను డాక్టర్ వర్రే వెంకటేశ్వర్లు యాదవ్, యాదాద్రి బోర్డు కమిటీ మెంబర్ పోచబోయిన ఈశ్వరమ్మ ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ ఆహ్వానం మేరకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త హరిహర రెడ్డి, మాజీ కార్పొరేటర్ మేకల లలిత యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడికి శ్రీనివాస్ యాదవ్, జంగయ్య యాదవ్, కిషోర్ యాదవ్, సింహ యాదవ్, ఇమ్మడి సతీష్, రమేష్, వినయ్ కుమార్, రాజేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# "తెలంగాణ రాజ్యాధికార పార్టీ"

## ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా దామళ్ళ సత్యం



**ఖమ్మం, సెప్టెంబర్ 7, నేటి శుభోదయ :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ(టిఆర్పి) ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా దామళ్ళ సత్యనారాయణ నియమితులయ్యారు. గత 20 ఏళ్లుగా క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయనకు వివిధ రాజకీయ, సామాజిక ఉద్యమాల్లో పనిచేసిన అనుభవం ఉంది. గతంలో బీఎస్పీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా, తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థి, సామాజిక, రాజకీయ రంగాల్లో చురుకైన పాత్ర పోషించిన ఆయనను తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై మరింత చురుగ్గా పనిచేస్తానని సత్యనారాయణ తెలిపారు.

**మల్లన్నకు కృతజ్ఞతలు**

తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్నకు దామళ్ళ సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నిర్మాణానికి కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ నిధుల విడుదలకు బీజేపీ డిమాండ్



**రాజేంద్రనగర్, నేటి శుభోదయ :** ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. ఫీజుల బకాయి, బీజేపీ లడాయి నినాదంతో విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు పిలుపు మేరకు అసెంబ్లీని ముట్టడించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు 1500 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తే అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఎంతోమంది విద్యార్థుల ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఎంతో కీలకమైనదని, నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల తరపున, విద్యార్థుల తరపున ప్రశ్నించే హక్కును ప్రభుత్వం గౌరవించాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధుల విడుదల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం పోలీసులు తోకల శ్రీనివాస్ రెడ్డిని అసెంబ్లీ ప్రాంగణంలో అరెస్ట్ చేసి సికింద్రాబాద్ గాంధీనగర్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ కార్యక్రమంలో జి పాండు యాదవ్, అడికే జనార్ధన్, సంతు గౌడ్, మధుసూదన్ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, తలారి చిన్న, అమర్ రెడ్డి, మాగాణి శివ, పవన్ సాయి, హర్ష వర్ధన్, లంకల సాయి, శంకర్ రెడ్డి, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620